J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 46 21.04.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఒక హత్య.... వంద ప్రశ్నలు!





- అవినాష్‌రెడ్డి కుటుంబంపై కుట్రపన్నుతోంది ఎవరు
- సిబిఐని సీబీఎన్ ఆడిస్తున్నాడా
- దస్తగిరి వెనుక ఎవరున్నారు
- అవినాష్‌ని హైకోర్టు తప్పించిందా? ఇరికించిందా

కడప మాజీ ఎంపీ, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి తమ్ముడు, సంచలనాత్మక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాబాయ్ వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య మిస్టరీ చిత్ర విచిత్ర మలుపులు తీసుకుంటోంది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రంలో జగన్‌కి పరోక్షంగా సహకరిస్తున్న భాజపా చక్రం తిప్పుతోంది. అటు కేంద్రానికి, ఇటు అధికారపార్టీకీ సంబంధం లేకుండా ఈ కేసులో కథ నడుపుతున్న మూడవ శక్తి ఎవరు...? అవినాష్‌రెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కేసుని దారిమళ్లిస్తోంది ఎవరు...? సిబిఐని సీబీఎన్ (చంద్రబాబు నాయుడు) ఆడిస్తున్నాడా...? ఆయనకి అంత పలుకుబడి ఉందా...? దస్తగిరి వెనుక ఎవరున్నారు...? తన అరెస్టును ఆపమంటూ తెలంగాణ హైకోర్టుకి వెళ్లిన అవినాష్‌ని హైకోర్టు తప్పించిందా...? ఇరికించిందా...?? ఇలాంటి భేతాళ ప్రశ్నలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో చక్కర్లు కొడుతున్నాయి.

తనను సీబీఐ అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అవినాష్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఏప్రిల్ 25 వరకూ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయొద్దంటూనే ఆయన జుట్టు సిబిఐ చేతికి అందించింది హైకోర్టు. ఓ వైపు ఈ నెల 25 వరకు అవినాష్‌ను అరెస్ట్ చేయొద్దని ఆదేశాలు జారీచేస్తూనే, మరోవైపు 25వ తేదీ వరకు ప్రతిరోజూ సీబీఐ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ ఆదేశంతో హైకోర్టు అవినాష్‌రెడ్డిని తీసుకెళ్లి సీబీఐ దొడ్లో కట్టేసినట్లుగా అయ్యింది. ఇప్పటికే సీబీఐ దృష్టిలో అనుమానితుడుగా ఉన్న అవినాష్‌రెడ్డి, తనకు తానుగా సీబీఐ చేతికి

10 లో

KRJC

STRESS-FREE MISSION

THE ACADEMICS
Academically High-end Staff
All India Exams' Curricular Programme
Practicals and Hands-on Experiments

THE LEARNING
Path Leading Materials
Critical Thinking Worksheets
Effective Weekly Worksheets
Effective Weekly Competitive Tests
All India Equivalent Model Tests

THE ENCOURAGEMENT
After-Test Analytical Counselling
Well-Planned Test Based Revision Hours
Around-Staff - Doubts Oriented Study Hours
Subject-Wise Student Individualized Gudiance
Individualized Parent-Staff Consulting

THE INFRASTRUCTURE
Safety and Discipline Atmosphere
Hygenic Ambience
English Conversation

THE UNWIND
RELAXATION TIME ZONE (RTZ)



Sri K.V. RATNAM
శీలేన శోభతే విద్య

విద్యావికాసానికి ఆధునికతను జోడిస్తూ...

Bi.P.C లో అద్వితీయమైన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ... M.P.C లో (IIT GOAL) వినూత్నమైన ప్రోగ్రామ్స్‌తో... ప్రణాళికాబద్ధమైన పరంపరను కొనసాగించడానికి రవీంద్ర నగర్, మాగుంట లే-అవుట్, నెల్లూరులో సరికొత్తగా మీ ముందుకు వస్తున్న...



Dr. KISHORE'S RATNAM JUNIOR COLLEGE
ENGLISH MEDIUM | DAY-SCHOLARS
A.C. Campus, MAGUNTA LAY-OUT, NELLORE.

2023-24 ACADEMIC YEAR

THE COURSES
M.P.C - MAIN & ADVANCED (IIT GOAL)
• FORTUNE-40 • SPARK JEE MAIN
Bi.P.C - NEET
• K-50 • SPARK NEET
IPE + AP EAPCET / TS EAMCET
Genesis Batch



డైరెక్టర్స్
డా॥ కె. కృష్ణ కిషోర్, MS (Ortho.)
కె. వాసంతి, కె. రోషిణి
90522 20543, 90522 20544

# యువతకు చేసింది శూన్యం

## కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై కమ్యూనిస్టుల 'ప్రచారభేరి'



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలిస్తామంటూ మభ్యపెట్టడం తప్ప ఆచరణలో చేసిందేమీ లేదని కమ్యూనిస్టు నాయకులు విమర్శించారు. ఈనెల 16న కోవూరు మండలంలోని గుమ్మళ్ళదిబ్బ కాలనీలో సిపిఐ, సిపిఎం వాటి అనుబంధ సంఘాల వారు 'ప్రచారభేరి' నిర్వహించి ప్రభుత్వాల విధానాలను తూర్పారబట్టారు. దేశంలోని యువతకు 2కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన ప్రధాని మోడీ నేటికీ దానిని ఆచరణలో పెట్టలేదని, విభజన హామీలు నెరవేర్చకుండా ఎప్పటికప్పుడు కాలయాపన చేస్తూనే ఉన్నారని, అదేవిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి, ఇప్పటికీ ప్రకటించకుండా యువతను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. డివైఎఫ్ఐ నాయకుడు సురేంద్ర, సిపిఎం, సిపిఐ నాయకులు గండవరపు శేషయ్య, మున్వర్‌బాబు, రమేష్, బీబీజాన్, సుహాసిని, గోవర్ధన్, విజయ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. ఆరోగ్య అవగాహన



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఎముకలు, కీళ్లు, నరాల వ్యాధులపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కొణతం భాస్కర్ పాల్గొని ఆరోగ్యం పట్ల వారికి అవగాహన కల్పించారు. నడక ఆరోగ్యానికి మంచిదని, దాని ద్వారా శరీరంలోని అవయవాల కదలికతో ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. వాకర్స్‌కు వైద్యపరీక్షలు నిర్వహించి సలహాలు అందజేశారు. సదస్సులో పాల్గొన్నవారికి వాకర్స్ సభ్యులు సదానందరెడ్డి, వెంకటరమణ ఉడికించిన కోడిగుడ్లను పౌష్టికాహారంగా అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ రీజనల్ కోఆర్డినేటర్ ఏకొల్లు రాఘవరెడ్డి, 2022 వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అధ్యక్షులు తలపనేని హరిబాబు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# జ్వాలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

తోటపల్లిగూడూరు మండలం వరిగొండలో వెలసివున్న ప్రముఖ దేవస్థానం శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవాలయంలో ఈనెల 16న ఆదివారం విశేష పూజలు జరిగాయి. ట్రస్టు బోర్డు ఛైర్మెన్ తాతా శ్రీనివాసులు పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు బొడ్డుపల్లి శ్రీనివాస్‌శర్మ, మోహన్‌కృష్ణలు పాల్గొని అమ్మవారికి వైభవంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ చేశారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## చాముండేశ్వరి అమ్మవారి

# ఆలయానికి విరాళం



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయంలో అన్నప్రసాద వితరణ కోసం నెల్లూరుకు చెందిన భక్తులు గాదం విశ్వనాథ్, అమ్మణ్ణమ్మ దంపతులు ఈనెల 16న పాతిక వేల రూపాయలు విరాళంగా సమర్పించారు. ఇఓ బండి శాంతయ్యకు ఆ నగదు అందజేశారు. ఆలయ మాజీ ఛైర్మెన్ కొండూరు కృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్(ఏపిపిజెఏ) ముద్రించిన 2023వ సంవత్సరం క్యాలెండర్‌ను ఈనెల 16న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వృత్తిపరంగా జిల్లా ఫోటోగ్రాఫర్ల ప్రతిభ అపూర్వమైనదంటూ మంత్రి కొనియాడారు. ఏపిపిజెఏ నెల్లూరుశాఖ నాయకులు, ఫోటో జర్నలిస్టులు జకీర్, మాల్యాద్రి, గణేష్, వెంకట్, విజయకృష్ణ, దేవా, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరి జయంతి

సమాజ సంస్కర్త, ప్రముఖ రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఈనెల 16న నెల్లూరులోని ఆర్‌ఎస్‌ఆర్ ఎం హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రజాసైన్స్ అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్ కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరేశలింగం సంఘసంస్కరణలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.



# 'నాడు-నేడు' పనులు సత్వరం పూర్తిచేయాలి

జిల్లాలో నాడు–నేడు రెండో విడత అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, పనులు సత్వరం పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టాక, ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశాలు జరిపి జరిగిన అభివృద్ధిని, జరగాల్సిన కార్యక్రమాల గురించి తెలుసుకుంటున్నారు. అధికారులకు అవసరమైన ఆదేశాలిస్తున్నారు. జూన్ రెండవ వారం పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి స్కూళ్లలో అన్ని మరమ్మత్తు పనులు పూర్తిగా చేపట్టాలన్నారు. నాడు–నేడు పథకానికి నిధులు పుష్కలంగా ఉన్నాయని, ఇప్పటివరకు 84 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇంకా 48 కోట్ల రూపాయల నిధులు విడుదలై ఉన్నాయని చెప్పారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఈవో గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### ప్రాజెక్టుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి :

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ పటిష్టంగా ఉండాలని, ప్రజలకు సాగునీటికి, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా నీటిపారుదల కాలువల నిర్వహణ కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఇటీవల ఏర్పాటుచేసిన సమావేశంలో ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంజురైన ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. ఇరిగేషన్ ఎస్.ఇ కృష్ణమోహన్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్.ఇ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

### భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి :

జాతీయ రహదారి నుండి కృష్ణపట్నం పోర్టుకు అనుసంధాన రహదారుల నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫేజ్ 3 క్రింద చేపట్టిన రహదారుల నిర్మాణాలకు సంబంధించి సేకరించిన భూములను అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వడంలో చాలా ఆలస్యం అవుతోందని, రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించి ఆ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నెల్లూరు ఆర్డీఓ మలోల, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ గోవర్ధన్, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

# 'నా హృదయతరంగాలు' ఆవిష్కరణ



నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి సందడి అరుణ రచించిన 'నా హృదయ తరంగాలు' పుస్తక ఆవిష్కరణ ఇటీవల నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ రూంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరి వెంకట శ్రీనివాసులు ఆ పుస్తకాన్ని సమీక్షించారు. ముఖ్య అతిధిగా ప్రముఖ కవి చిన్ని నారాయణరావు పాల్గొన్నారు. నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

# బాబోయ్!.. ఎండలు భగ్గు భగ్గు!

ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్‌లోనే ఇట్లావుంటే మే నెల ఇంకెంత భగ్గుమంటాయోనని ప్రజలు భయపడిపోతున్నారు. ఈ ఎండాకాలం గతంలోకంటే మండిపోతోంది. నెల్లూరు నగరంలో పరిస్థితులు మరీ దారుణం. రోడ్లపక్కన ఎక్కడా చెట్లన్నివి లేకుండా చేయడంతో పాదచారుల గోష్ట అంతా ఇంతా కాదు. రోడ్ల విస్తరణ పేరుతో చెట్లన్నీ నరికేసి సామాన్యప్రజలకు నిలువ నీడలేకుండా చేశారు. ఈ ఎండాకాలంలో రోడ్లమీద నడవలేక పేదప్రజలు ఎంత బాధలు పడుతున్నారో చెప్పలేం. పగలంతా వేడి, రాత్రయితే ఉక్కపోత. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నందువల్ల ఎవరికి వారు జాగ్రత్తలు పాటిస్తూ ఎండకు తిరగకుండా ఉండడమే మంచిది. ఉదయం 8 గంటల నుంచే ఎండ భగ్గుమంటుండడం, సాయంత్రం దాకా భగభగలు తగ్గకపోవడం, రాత్రిపూట వేడిగాలులు వీస్తుండడంతో, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలంటున్నారు వైద్యులు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల దాకా ఎండలో తిరగకుండా ఉండడం శ్రేయస్కరమని, వడదెబ్బ తగలకుండా నీడపట్టున ఉండాలని, ఈ వారమంతా ఎండవేడి మరింత పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు కనుక, మరింత జాగ్రత్తగా ఉండాలని వారు హెచ్చరిస్తున్నారు.

# నాకో వృద్ధాశ్రమం కావాలి!

మనిషి జీవితం
యుద్ధరంగమై జ్వలిస్తున్నపుడు
రాకాసి అలలు నడినెత్తిన స్వారీ
చేస్తున్నప్పుడు
బ్రతుకే కన్నీటి సుడిగుండంలో
చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నప్పుడు
ముడతలు పడ్డ దేహగాయాల సంరక్షణ
బాధ్యత మోసే స్థితి స్ఫురించదు
వయసు సంద్రమై మీదపడే మనుషులు
సొంత మనుషులైనా లాలించే వీలుండదు
మనిషి జీవనగమనంలో వేదనల బాధలు
ఉవ్వెత్తున ఎగుస్తున్నప్పుడు –
లేమితనం ఇంట్లో పాములపుట్టై తిష్టవేసి
ప్రతిష్టంభన పారువేటగా మారినపుడు
వృద్ధత్వం మోయలేని బరువవుతుంది

ఆ ఆపత్సమయంలో ఆసరా ఇచ్చి
ఆదుకొనేవి –
తీరం చేరని వ్యక్తుల జీవితాల్లో
వెల్గుపూలు పూయించేవి
నడిసంద్రంలో ఆలంబనగా నిలచేవి
అక్కున జేర్చుకొనేవి
వృద్ధాశ్రమాల ఉద్దీపనల వాకిళ్ళే కదా!
వదాన్యత సౌరభ విశిష్టతలు తీర్చిదిద్దిన
ఆశ్రయ ఆశ్రమాలే
మనిషిని ప్రేమించే మహనీయ
ఆశయ సంపదల ఆనవాళ్ళే కాదా
మనసున్న మనసులు వెలుగు దివిటీల
మార్గదర్శనమై దారిచూపుతూ
కుటుంబాలకు సంజీవనులు ఈ ఆశ్రమాలు
పిల్లల బ్రతుకులు సంక్షుభితమయినపుడు
గుప్పెడు ప్రాణాల్ని నిల్పేవి
ఈ ఆశ్రమ దేవాలయ గోపురాలే కదా
వృద్ధాప్యాన్ని భయపెట్టి మనమే
పిల్లలమై చలాకీగా ఆశ్రమాల
నీడన బ్రతుకు నీడుద్దాం
మన పిల్లల ఆక్రందనల ఆక్రోశాల్ని
'త్యాగ' వికాసంతో అణచివేద్దాం!



– చిన్ని నారాయణరావు
94402 02942





## ఆత్మీయ స్వాగతం

నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టిన కే.తిరుమలేశ్వరరెడ్డిని గౌరవపూర్వకంగా కలిసి స్వాగతం పలికిన నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఏపి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ కమిషనర్ బి.చందర్, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు).





• 5 రోజుల పర్యటన

# జిల్లాకొస్తున్న వెంకయ్యనాయుడు

### ఏప్రిల్25న వెంకటాచలంలో అక్షర స్కూల్ వార్షికోత్సవం

### 26న ఆత్మకూరులో బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి విగ్రహం ఆవిష్కరణ



భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ నెల 24వ తేదీ జిల్లాకు రానున్నారు. ఏప్రిల్24 సాయంత్రానికి జిల్లాకి చేరుకొని 28 వరకూ అంటే 5 రోజులపాటు జిల్లాలో ఉంటారు. 24వతేది సోమవారం సాయంత్రానికి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకి వస్తారు. 25వ తేదీ మంగళవారం అక్షర విద్యాలయం వార్షికోత్సవ వేడుక 'అక్షరోదయం'లో పాల్గొంటారు.



26వ తేది బుధవారం ఉదయం బయలుదేరి ఆత్మకూరుకు వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఉంటారు. ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్ కళ్యాణ మండపంలో ఉదయం 10గంటల నుండి తన పాత మిత్రులను, అభిమానులను కలుసుకుంటారు. అదేరోజు సాయంత్రం ఆత్మకూరులోని బిఎస్సార్ కూడలిలో మాజీ శాసనసభ్యులు దివంగత నేత డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 27వ తేదీ స్వర్ణభారత్ ట్రస్టులో అభిమానులకు అందుబాటులో ఉంటారు. 28వతేదీ మధ్యాహ్నం నెల్లూరు నుండి రైల్లో బయలుదేరి విజయవాడ వెళ్తారు.

వెంకయ్య ఎప్పుడు ఏ పదవిలో ఉన్నా నెల్లూరును మాత్రం మరువలేదు. తరచూ పుట్టింటికి వస్తూనే ఉండేవారు. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ పొందిన తరువాత కూడా ఆ ఆనవాయితీ, అలవాటు తప్పకుండా.. జిల్లాకు వచ్చి వెళ్తున్నారు.

# 'కిమ్స్'లో అరుదైన చికిత్స

• డ్రగ్ కోటెడ్ బెలూన్‌తో రక్తనాళాలు సరిచేశారు




నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రిలో తొలిసారిగా ఓసిటి అనే పరికరం ద్వారా డ్రగ్ కోటెడ్ బెలూన్‌తో గుండెకి సంబంధించిన రక్తనాళాలు సరిచేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్, సిమ్స్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కిమ్స్‌లో ఈనెల 18న డాక్టర్ శ్రీనివాసరాజు ఆ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న ఓ యువకునికి గత ఏడాది గుండెనొప్పి రాగా అక్కడి ఆసుపత్రిలో స్టంట్ వేయించుకున్నారని, అయితే మళ్ళీ కొద్దిరోజుల క్రితం గుండెనొప్పి రావడంతో బెంగుళూరులో చికిత్స చేయించుకున్నాడని, ఆ యువకుడు ఇటీవల నెల్లూరు కిమ్స్ ఆసుపత్రికి వైద్యపరీక్షల కోసం రాగా, పరీక్షించి చూస్తే రక్తనాళం పైభాగం కొంత మూసుకుపోయి ఉందని, ఈ నూతన చికిత్సా విధానాన్ని అవలంభించి దానిని సరిచేశామని తెలిపారు. ఇంతటి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినందుకు ఆసుపత్రి డైరెక్టర్ గిరినాయుడు డాక్టర్ల బృందాన్ని, ప్రత్యేకించి డాక్టర్ శ్రీనివాసరాజును అభినందించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వి రెడ్డి, సాహెబ్‌పీరా, నాగరాజు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 30 నుంచి..

# శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైవున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి వచ్చేనెల 10వ తేది వరకు అంగరంగవైభవంగా జరుగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలిరానుండడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 4న హనుమంత వాహనసేవ, 5న బంగారు గరుడసేవ, 6న కల్యాణోత్సవం, 7న రథోత్సవం పెద్దఎత్తున నిర్వహించనున్నారు. ఆమేరకు నెల్లూరు ఆర్డీఓ మలోల ఆధ్వర్యంలో, ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలమండలి వారు సమావేశమై ఏర్పాట్ల విషయమై చర్చించారు.


# ఘనంగా ఎన్నెస్కే జయంతి



ప్రముఖ చరిత్ర పరిశోధకులు, నెల్లూరుకు చెందిన ప్రముఖ సారస్వతమూర్తి స్వర్గీయ ఎన్నెస్కే (నేలనూతల శ్రీ కృష్ణమూర్తి) జయంతి సభ ఈనెల 16న నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగింది. స్థానిక వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి పాల్గొని 'ఎన్నెస్కే జీవితం-సందేశం' అనే అంశంపై ప్రసంగించి ఎన్నెస్కే స్మారక సమ్మానం స్వీకరించారు. తొలుత ఎన్నెస్కే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్య నాయుడు, డా. ఎం.సుబ్రహ్మణ్యం, కాళిదాసు పురుషోత్తం, టి.రమణయ్య పాల్గొన్నారు.

# 30న.. పెరసం వార్షికోత్సవం

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 14వ వార్షికోత్సవం ఏప్రిల్ 30వ తేది ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు స్థానిక టౌన్‌హాల్‌లోని రీడింగ్ రూమ్‌లో జరుగుతుందని పెరసం నిర్వాహకులు మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధరబాబు, గంగిశెట్టి శివకుమార్, తోట సులోచన తెలిపారు. ఈ సందర్భంగా 'మా నాయన పాట' రచయిత డా. సుంకర గోపాలయ్యకు రాష్ట్ర స్థాయి పెరసం పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ కవి పెళ్లూరు సునీల్ ఆ పుస్తకాన్ని సమీక్షిస్తారని తెలిపారు.

లాయర్
ఏప్రిల్ 21, 2023

# అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత ఏదీ?

దేశంలో అగ్నిప్రమాదాలు జోరందుకుంటున్నాయి. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్తున్నారే కానీ, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్న చందాన ఉంది పరిస్థితి. అసలే మండు వేసవి. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఒక మోస్తరు నుంచి భారీస్థాయి అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేనిది ఈ ఏడాది ఫిబ్రవరి నెలనుంచే ఎండ తీవ్రత హెచ్చుతూ వస్తోంది. ఇప్పటికే 40 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ దాకా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవి తీవ్రతవల్ల కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలా భయంకరంగా ఉష్ణోగ్రతలు పెరగడానికి మానవ తప్పిదాలే కారణం. అడవులు నరికివేయడం, కొండలు గుట్టలు తొలగించడం, పెద్దపెద్ద వృక్షాలను కొట్టేయడం, కాలుష్యాలు పెరిగిపోవడం, వ్యర్థాలను సక్రమంగా తొలగించ లేకపోవడం, ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ కావడం, కార్బన్ ఉద్గారాలు పెరుగుతుండడం..కారణాలేమైతేనేం పర్యావరణం బాగా దెబ్బతినిపోతోంది. మానవ నిర్లక్ష్యమే ఈ ప్రకృతి విధ్వంసానికి మూలమన్నది అందరికీ తెలిసిందే. ఫలితంగా అనేక రకాల ప్రమాదాలను మానవుడు తనంత తాను కొని తెచ్చుకున్నట్లవుతోంది. అలాంటి ప్రమాదాల్లో అగ్నిప్రమాదాలు మరీ భయంకరం. వీటివల్ల ఆస్తినష్టం, ప్రాణనష్టం ఎక్కువగా ఉంటాయి కూడా. ప్రమాదవశాత్తూ విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో జరిగే ప్రమాదాలు కూడా భారీగానే పెరుగుతున్నాయి. దేశంలో జరిగే 80 శాతం అగ్నిప్రమాదాలు ఇందువల్లే జరుగుతున్నాయని కూడా నిపుణుల అంచనా. ప్రతిఏటా వేలాది ఘటనలు, వేలాదిమంది మరణాలు ఈ అగ్నిప్రమాదాల తీవ్రతను తెలియజేస్తూనే ఉన్నాయి. అయితే, అగ్నిప్రమాదాల ముప్పును నివారించడానికి, తరచూ జరిగే ప్రమాదాలు జరగకుండా ఉండడానికి ముందు జాగ్రత్తలు బోలెడున్నాయి. కానీ, వాటిపట్ల ఎవరూ పెద్దగా శ్రద్ధ చూపకపోతుండడం విచారకరం. నాశిరకం విద్యుత్‌తీగలు, పరికరాల వినియోగం వల్ల మండువేసవిలో అవి పేలిపోవడం, లేదా కాలిపోవడం, తద్వారా ప్రమాదాలు జరుగుతుండడం సర్వసాధారణమైపోతోంది. కానీ వాటి కొనుగోళ్ళు మాత్రం ఆగడం లేదు. దేశంలో గతంలో జరిగిన అగ్నిప్రమాదాలతో రోజూ కనీసం 35మంది వరకు మరణించినట్లు నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా, ఆ ప్రమాదాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేవారు కరువవుతున్నారు. ఎక్కడైనా నిప్పు రాజుకుని పొగ, లేదా మంటలు వస్తే వెంటనే వాటిని అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సాధనాలు ఉన్నా, అవగాహన లేకపోవడంతో వాటిని ఎవరూ వినియోగించలేకపోతున్నారు. అనేక పరిశ్రమల్లో వాటిని అలంకారానికి గోడలకు తగిలించి ఉంటారే తప్ప, ఏళ్ల తరబడిగా వాటి పరిస్థితి ఎలా ఉందో కూడా చూసేవారు తక్కువే. భద్రత అన్నిటికంటే ముఖ్యమని తెలిసినా, కార్మికులు ఎక్కువమంది పనిచేసే స్థలాల్లో కూడా ఇలాంటి అభద్రతా భావమే కనిపిస్తోంది. కాస్త జాగ్రత్తగా ఉంటే చాలు.. ఎంతటి ఘోరప్రమాదాన్నయినా నివారించుకునే పరిస్థితి ఉంటుందని తెలిసినా, పెద్దపెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్లల్లో కూడా ఈ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండడం లేదు. ఫలితంగా ఘోర ప్రమాదాలెన్నో జరిగిపోతున్నాయి. ఇళ్లల్లో గ్యాస్ సిలిండర్లు, టపాసుల తయారీ పరిశ్రమలు, వాటిని నిల్వచేసే గోడౌన్లు, రసాయనాలు నిల్వ చేసి ఉండే ప్రాంతాల్లో ఎండాకాలంలో ఎండవేడిమికి తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. పంటపొలాల్లో, ఇళ్ల వద్ద ఉండే గడ్డివాములు, పూరిళ్ళు వంటివి కూడా ఈ ప్రమాదాలకు పుట్టిళ్లుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, అటవీప్రాంతాల్లో ఒక్కోసారి ఆకతాయిలెవరో నిర్లక్ష్యంగా కాల్చి పారేసిన బీడీలు, సిగరెట్ల వంటివి కూడా పెద్దప్రమాదాలకు దారితీస్తుంటాయి. వీరి నిర్వాకం వల్ల ఆ నిప్పు అడవుల్లో కార్చిచ్చుగా మారి అడవులు పెద్ద విస్తీర్ణంలో తగలబడిపోతుంటాయి. ఏదేమైనా, దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో అగ్నిమాపకశాఖను కూడా బాగా ఆధునీకరించి, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మరింత బలోపేతం అయ్యేలా చూడాలి. ప్రమాదాల బారిన పడినవారిని కాపాడే ఈ శాఖకు అవసరమైన సిబ్బందిని, వస్తుసామగ్రిని ప్రభుత్వాలు వారికి కొరత లేకుండా అందించాలి. నగరాలు, పట్టణాల్లోనే కాదు, గ్రామప్రాంతాల్లో, అటవీప్రాంతాల్లో కూడా ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో దేశంలో ఈ అగ్ని ప్రమాదాలను నివారించడానికి ఇకనైనా అన్నిరకాలుగా పటిష్టమైన చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

# ఎండలు మలమల!.. జనం విలవిల!



ఎండాకాలం వచ్చిందంటే ఎన్నో రకాల సమస్యలు జనాన్ని చుట్టుముడుతుంటాయి. గతంలో ఎండలంటే ఇంత భయం ఉండేది కాదు. మహా అయితే 30 డిగ్రీలుండేది. ఒక్కోసారి 33 దాకా వచ్చిందంటే, అబ్బో ఈ ఎండల్ని భరించలేం బాబోయ్ అనుకునేవారం. ఇప్పుడు చూడండి..ఏకంగా 40 డిగ్రీలు కూడా దాటేస్తోంది ఎండ. ఏప్రిల్ నెల ముందునుంచే భానుడు భగ్గుమంటున్నాడు. గత వారం రోజులుగా మరింత మండిస్తున్నాడు. ఇప్పుడే ఇలా ఉంటే, ఇక మే నెల వస్తే పరిస్థితేమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండల దెబ్బకి 'రోహిణి కార్తెలో రోళ్ళు పగిలిపోతాయని' పెద్దోళ్లు చెప్తుంటారు. అదేదో సామెతని అనుకున్నాం కానీ, ఇప్పుడీ ఎండల్ని చూస్తే రోళ్లు కాదు, కొండలే పగిలిపోయేట్లున్నాయి.

ఈ మండే ఎండల్లో మునుపటిలా కాకుండా అందరూ ఎంతో జాగ్రత్తగా ఉండాలి. లేనిపోని రోగాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ముసలిముతకా నీడపట్టున కదలకుండా ఉండేలా చూసుకోవాలి. శరీరంలో నీళ్లు ఎప్పుడు ఆవిరైపోతాయో తెలియదు కనుక, మంచినీళ్ళు బాగా తాగుతుండాలి. చల్లటి మజ్జిగ తాగితే ఇంకా మంచిది. ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి కనుక, వాటిని కూడా సిద్ధంగా ఉంచుకుని అవసరమైనప్పుడు తాగడం మంచిది. యువకులు ఎండకు తిరగకుండా, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకప్పుడు నెల్లూరులో ఏ వీధిలో చూసినా ఎండాకాలంలో చలివేంద్రలు కనిపించేవి. దాతలు పాదచారులకు, పేదలకు చల్లటినీళ్లు, మజ్జిగ ఇచ్చి పుణ్యం కట్టుకునేవారు. ఇప్పుడు నెల్లూరు నగరంలో చలివేంద్రలు ఎక్కడో ఒకటి కనిపిస్తోంది. ఎండాకాలం వస్తే అన్ని కార్యాలయాల్లో చల్లటి కుండల్లో మంచినీళ్ళు ఉండేవి. ఇప్పుడు ఫ్రిజ్‌ల కాలం వచ్చేశాక, కుండల చల్లదనానికి నీళ్ళొదిలేశారు చివరికి తాగే మంచినీళ్ళు కూడా అమ్మకంలోకి వచ్చాక, ఎక్కడబట్టినా వాటర్‌బాటిల్స్ సేల్స్ బాగా పెరిగిపోయాయి. అంతా వ్యాపారమైపోయింది. ఆ నీళ్ళు నాణ్యతగా ఉన్నాయా లేదా అని పట్టించుకునే నాథులుండరు. అన్నీ సక్రమంగా ఉంటే కళ్లీలెందుకుంటున్నాయి?.. వాస్తవానికి నేటికీ జిల్లాలోని అనేక గ్రామాల్లో మహిళలు ఎంతెంతో దూరం నుంచి కడవలు, బిందెలతో నీళ్ళు తెచ్చుకునే దుస్థితి ఉండనే ఉంది. పల్లెలు,

## సమస్యల తో 'రణం'

పట్టణాల్లో కూడా ఎండాకాలంలో సరిగా మంచినీళ్లు దొరకని ప్రాంతాలెన్నో ఉన్నాయి. ముందుగానే ప్రణాళిక ప్రకారం ప్రజలకు నీటిఎద్దడి లేకుండా చేయాలన్నది అధికారులకు ఆలోచన ఉంటుంది కానీ, పట్టించుకునేందుకు అంత తీరిక ఏదీ?.. ఎండాకాలానికి ముందుగానే జిల్లావ్యాప్తంగా కుళాయిలు బాగుచేయించడం, నీళ్ళ లీకేజీ లేకుండా చూడడం, మంచినీటి రక్షిత పథకాలను శుభ్రం చేయించడం చేసేవారు. ఇప్పుడెవరు చేస్తున్నారు?..ఎవరు చేయిస్తున్నారు?..అంతా కాగితాల లెక్కల్లో మాత్రమే ఉంటుంది. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి కుళాయిలు లీకై, డ్రైనేజీల్లోను, డ్రైనేజీగొట్టాలు పాతబడి పగిలిపోయి ఆ మురుగంతా మంచినీటి కుళాయిల్లోకి వస్తున్నా ఎవరు పట్టించుకుంటున్నారు?.. కాకుంటే నెల్లూరుకు భూగర్భడ్రైనేజీకి సంబంధించి మన నాయకులు ఎంత గొప్పలు చెప్పారో.. పాత పేపర్లు తిరగేస్తే చాలు..కళ్ళు తిరిగిపోతాయి. ఏళ్ళు తిరిగిపోతున్నాయి కానీ, అదిప్పటికీ ఒక కొలిక్కి రాలేదంటే నెల్లూరుకు అంతకన్నా దౌర్భాగ్యం ఇంకోటి కావాల్నా?..

### మూగజీవాల బాధలు వర్ణనాతీతం! :

ఈ మిడిమిడి ఎండాకాలంలో మనుషుల సంగతే కాదు, పక్షులు, పశువులు, మూగజీవాలు కూడా ఎన్నో అవస్థలు పడుతూనే ఉన్నాయి. రోడ్లమీద ఎన్నో గేదెలు, ఆవులు..ఎవరివో..తిరుగుతూనే ఉంటాయి. దాహమైనప్పుడల్లా అవి ఏ మురుగు కాలువల్లోనో నోళ్లు పెడుతుంటాయి. ఏది దొరికితే అది తినేస్తుంటాయి. అవెంత అనారోగ్యం పాలవుతున్నాయో పట్టించుకునేదెవరు?.. నగరంలోనే ఇలా ఉంటే ఇక అడవుల్లో ఈ ఎండదెబ్బకి నీటి వనరులన్నీ ఎండిపోయి, నీళ్ళు దొరక్క, ఊళ్ళలోకి వచ్చేస్తున్న వన్యప్రాణుల గతి ఇంకెంత ఘోరమో ఊహించండి. అసలే దాహం తట్టుకోలేక, అవి కళ్లలో ప్రాణం పెట్టుకుని జనావాసాల్లోకి వస్తే, కుక్కలు వాటిపై దాడిచేసి దారుణంగా చంపేస్తుంటాయి. ముఖ్యంగా చుక్కల జింకలు, దుప్పులు ఇలా దుర్మరణం పాలవుతున్న ఘటనలు ఎండాకాలాల్లో బోలెడన్ని. అడవుల్లో నీళ్ళ తొట్టెలు ఏర్పాటుచేస్తున్నామంటారు. మంచిదే..అవే అందుబాటులో ఉంటే అవి ఊళ్ళల్లోకి ఎందుకొస్తాయి?..మీరే ఆలోచించండి!...పల్లెల్లో పాతకాలంలో ప్రజలు గోడల మీద, మిద్దెల మీదా చిన్నచిన్న గిన్నెలు పెట్టి నీళ్ళు పోసేవాళ్లు..పక్షులు తాగుతాయని. పిచ్చుకలకు ఇళ్ళల్లో వరికంకులు కట్టిపెట్టేవాళ్ళు..తింటాయని. ఇప్పుడలాంటివేమీ కనిపించడం లేదు. రానురాను మనుషుల్లో అలాంటి కరుణ ఇప్పుడు కనుమరుగవుతున్నదేమో అనిపిస్తోంది. ఫోన్లు చూసుకోవడం తప్ప, చుట్టూ పరిస్థితులు చూసుకోవడం లేదు. పచ్చదనాన్ని, పరిశుభ్రతని కాపాడుకుందామని, మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించుకుందామని, స్వచ్ఛ నెల్లూరు సాధిద్దామని చెప్తూనే ఉంటారు మన నాయకులు. కాకి అరుస్తూనే ఉంటుంది..కరవాడ ఎండిపోతూనే ఉంటుందన్న సామెతగా, మనవాళ్లు తియ్యతియ్యటి మాటలు చెప్తూనే ఉంటారు.. వేసిన మొక్కలు మాత్రం ఎండిపోతూనే ఉంటాయి. అంతెందుకు..నగరంలో డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లు చాలాచోట్ల ఈ ఎండలకి మాడిపోతున్నాయి. రోజూ సక్రమంగా నీళ్లు పోస్తున్నామా?..అంతా మొక్కుబడి వ్యవహారమేనా?.. గుండెమీద కాదు.. 'నీళ్ళబండి' మీద ఒట్టేసి చెప్పండి చూద్దాం!...

– సంచారి

# పిల్లలు ఈతకు వెళ్ళకుండా జాగ్రత్తపడాలి

పదవ తరగతి పరీక్షలు, ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. అసలే ఎండాకాలం, ఆపై సెలవులు..ఇక విద్యార్థులు, యువకుల సంగతి చెప్పాల్నా..వారికిక అడ్డే ఉండదు. ఎక్కడికంటే అక్కడికి వెళ్లిపోతుంటారు. తల్లితండ్రులు ఈ సమయాల్లోనే వారిని కనిపెట్టుకుని ఉండాలి. ముఖ్యంగా చెరువుల్లో, బావుల్లో, నదుల్లో ఈతకు వెళ్ళడం, బీచ్‌లకు వెళ్ళి సముద్రస్నానాలు చేయడం వంటివి విద్యార్థులకు సహజంగానే సరదాగా ఉంటాయి. స్నేహితులు కలిస్తే చాలు, ఇదిగో ఇప్పుడే వస్తామంటూ తల్లితండ్రులకు చెప్పి వెళ్లిపోతుంటారు. కొందరు చెప్పకుండానే వెళ్తుంటారు కూడా. అయితే, వారు ఎక్కడికి వెళ్తున్నారో, వారితో కలసి ఇంకెంతమంది వెళ్తున్నారో తల్లితండ్రులు పట్టించుకోవాలి. ఈ విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదు. ఈత సరదాలో పడి బిడ్డల ప్రాణాలు పోయాక, ఆ తర్వాత ఎంత ఏడ్చినా ప్రయోజనం ఉండదు. అదేవిధంగా పోలీసులు, గ్రామాల్లో ఉండే అధికారులు కూడా చెరువులు, నదుల వద్ద, ప్రమాదకరమైన స్థలాల వద్ద 'ఈత ప్రాణాంతకమని, ఇక్కడ ఈతకు దిగకూడదని' హెచ్చరికలతో బోర్డులు రాసిపెట్టాలి. ప్రతి ఏటా ఎండాకాలంలో జిల్లాలో ఈతసరదాలు ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులు, యువకుల ప్రాణాలకు ముప్పుగా ఉంటున్నాయి. ఇప్పటికైనా తల్లితండ్రులు కళ్ళుతెరవాలి. బిడ్డలు ప్రమాదాల బారిన పడకుండా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలి.

– కె.కేశవరావు, మైపాడు.

# మందుల ధరలను తగ్గించాలి

అసలే నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటుంటే ఇటీవల మందుల ధరలు కూడాపెరగడం విచారకరం. జబ్బులున్నవారు తప్పనిసరిగా మందులు వాడాల్సిందే. అవి ఎంత ధర ఉన్నా కొనక తప్పదు కదా అని, ఇష్టానుసారం ధరలు పెంచేయడం సముచితం కాదు. మందుల కొనుగోలుదారుల్లో నిరుపేదలు, మధ్యతరగతివారు కోట్లాదిమంది ఉన్నారు. ఈ అదనపు భారాన్ని మోయడం సామాన్యులకు కష్టం. కేంద్రం ఇకనైనా పునరాలోచించి పేదసాదలకు ఇబ్బంది లేకుండా మందుల ధరలను తగ్గించాలని ప్రార్థన.

– ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# గ్రంథాలయాల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపాలి

గ్రంథాలయాలకు స్థానిక సంస్థలు చెల్లించాల్సిన సెస్సులు చెల్లించకపోవడంతో, ఏళ్ల తరబడిగా లైబ్రరీలు ఎదుగుబొదుగు లేకుండా పడివుంటున్నాయి. నెల్లూరుజిల్లాలో కూడా కోట్లాదిరూపాయలు సెస్సు బకాయిలున్నాయి. వాటిని వెంటనే చెల్లించేందుకు జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు శ్రద్ధ చూపితే తప్ప గ్రంథాలయాలకు మోక్షం ఉండదు. ఇప్పటికే పలు గ్రంథాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. కొత్త పుస్తకాల కొనుగోళ్ళకు, ప్రాచీన గ్రంథాల భద్రతకు అవసరమైన నిధులు లేవు. నిత్యం గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య బాగా ఉన్నప్పటికీ గ్రంథాలయాల పరిస్థితి ఎంతోకాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంది.

– సివిఎస్ఆర్ సుధాకర్, కావలి.

# అధ్యాపకుల సమస్యలు తీర్చేందుకు కృషిచేస్తా

## ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న కేవీసి జూనియర్ కళాశాలను ఆయన ఈనెల 18న సందర్శించి అక్కడ పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులకు ఏమైనా సమస్యలుంటే తనను కలవచ్చని, వారికి ఎప్పుడూ తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ గురవయ్య, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు సునీల్, సందాని తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ స్కూల్స్ సంఘం ఆధ్వర్యంలో సన్మానం...

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర నాయకులు అన్వర్ బాషా, జిల్లా అధ్యక్షులు కర్తం ప్రతాప్‌రెడ్డి పాల్గొని విద్యా రంగానికి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన సేవలను వివరించారు. అనంతరం పలువురు సంఘ నాయకులు, పాఠశాల కరెస్పాండెంట్లు చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు.

# రాహుల్‌పై కక్షసాధింపు దారుణం



కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై లోక్‌సభలో సభ్యత్వ అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ప్రముఖ వైద్యురాలు పల్లంరెడ్డి యశోధర ఇటీవల నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద స్వచ్ఛందంగా సంకల్ప దీక్షను చేపట్టారు. రాహుల్‌గాంధీ సభ్యత్వ సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆమె డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతం కావడాన్ని సహించలేక రాహుల్‌గాంధీపై కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. తప్పుడు కేసులతో ఆయన ఎంపీ పదవిపై అనర్హత వేటు వేయడం తగదని విమర్శించారు. ప్రభుత్వం పునరాలోచించి సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సివి.శేషారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్‌బాబు, ఉడతా వెంకట్రావు, షేక్ ఫయాజ్, కొండా అనిల్‌కుమార్, లత, షేక్ ఫజులుద్దీన్, గునపాటి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం జగన్ పట్ల.. జనంలో విశేషాదరణ

- ఆర్ఎస్ఆర్



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల తీరుపై ప్రజల స్పందన అద్భుతంగా ఉందని, ఎక్కడచూసినా జగన్ పట్ల విశేషాదరణ కనిపిస్తోందని 20వ డివిజన్ వైకాపా సీనియర్ నాయకుడు రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆయన నెల్లూరురూరల్‌లోని పలు ప్రాంతాల్లోని ప్రజలను కలిసి ఆ పథకాల పట్ల వారి స్పందనను అడిగి తెలుసుకున్నామని, ప్రజలు పోటీపడి స్వచ్ఛందంగా మిస్డ్‌కాల్ ఇచ్చి ప్రభుత్వం పట్ల తమకున్న సానుకూలతను తెలిపారని ఆయన అన్నారు. రూరల్ ఇన్‌ఛార్జ్, ఎం.పి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సూచనలతో వైకాపా కార్యకర్తలతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా దిగ్విజయంగా నిర్వహించామ న్నారు. 20వ డివిజన్‌లోని పెద్ద బావి సెంటర్ చివరివీధి, హనుమాన్ జంక్షన్, వర్ధిత అపార్ట్‌మెంట్, స్నేహనగర్, 5వవీధి, వాత్సల్య వృద్ధుల ఆశ్రమం పింఛను లబ్ధిదారులను కలిసి మాట్లాడామన్నారు. ఈనెల 18వ తేదీతో 2300 మంది ఇళ్ళకి 'గడప గడపకు వెళ్లి' వారి అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్లలో...

# కనుమరుగవుతున్న కూలీ వ్యవస్థ



## మోయలేని బరువులతో ప్రయాణికుల అవస్థ

**ఒకప్పుడు రైలు నెల్లూరు స్టేషన్‌లో ఆగిందంటే లోపలున్న వారు బయటకు దిగే లోపలే బయటున్న కూలీ(పోర్టర్)లు లోపలకు ఎక్కేసేవారు. కూలీ... కూలీ... కూలీ అంటూ అరుచుకుంటూ ప్రయాణికుల సామాన్లు(లగేజి) మోయడానికి పోటీపడేవారు. ముఖ్యంగా ముంబై, కొత్త ఢిల్లీ, కలకత్తా, హైదరాబాదు, విశాఖపట్టణం, కొచ్చి, తిరువనంతపురం, తిరుచ్చి, కోయంబత్తూర్ వంటి దూర ప్రాంతాల నుండి వచ్చే రైళ్లపై ఈ కూలీలు ఈగల్లాగా వాలేవారు. అది వారి బ్రతుకుదెరువు, వారి జీవనోపాధి. కానీ ఇప్పుడు పరిస్థితి అలాలేదు.**

చాలా రైల్వేస్టేషన్లలో (నెల్లూరుతో సహా) పోర్టర్ల వ్యవస్థ పూర్తిగా అదృశ్యమైపోయింది. పోనీ దేశమంతా అలాగే ఉందా..? అంటే లేదు. ముంబై, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, కలకత్తా, ఢిల్లీ, విశాఖ పట్టణం, విజయవాడ, చెన్నై వంటి నగరాలలో ఈ పోర్టర్లు కావలసినంత మంది మనకి కనిపిస్తారు. మరికొన్ని స్టేషన్లలోనే ఎందుకిలా...? అంటే సమాధానం లేదు. ఒక్క నెల్లూరులోనే కాకుండా మహా నగరాలను వదిలేస్తే చాలా జిల్లాల ప్రధాన కేంద్రాల రైల్వేస్టేషన్లలో ఇదే పరిస్థితి.

### తొలి మహిళా కూలీ సంధ్య మరవి...!





భారతదేశంలోనే తొలి మహిళా కూలి మనకి మధ్యప్రదేశ్ జబల్పూర్ సమీపంలోని కట్నీ జంక్షన్ రైల్వేస్టేషన్‌లో కనిపిస్తుంది. ఆమె పేరు సంధ్య మరవి. ఆ స్టేషన్‌లో 40మంది కూలీలు పని చేస్తుంటే సంధ్య ఒక్కటే మహిళ. తనకు 30 సంవత్సరాల వయస్సులో అకస్మాత్తుగా ఆమె భర్త ప్రాణాలు విడిచాడు. ఆమె కళ్ళముందు అంతా శూన్యమే. ముగ్గురు పిల్లలు, వారిని పెంచి పోషించాలి, ఇదే ఆమె లక్ష్యం. ఆ లక్ష్యమే ఆమెను రైల్వే కూలీని చేసింది. తనతోపాటు పనిచేసే సాటి కూలీలకు తీసిపోకుండా వారితో సరిసమానంగా ఆమె ప్రయాణీకుల బరువులు మోస్తుంది. రైల్వే కూలీలంటే కేవలం మగవాళ్ళే ఉంటారన్న భ్రమను సంధ్య తొలగించింది. 2017 జనవరి నుండి అంటే సుమారు 7 సంవత్సరాలకుపైగా ఆమె రైల్వే కూలీగా సేవలందిస్తూ తన కుటుంబానికి ఆధారమయ్యింది. ఇలా ఎన్నో జీవితాలకు బ్రతుకు దెరువు చూపిస్తాయి రైల్వేస్టేషన్లు. అలాంటి జీవనబాట కల్పించే వృత్తి ఇప్పుడు క్రమేణా కనుమరుగైపోతోంది.

ఆధునిక అనారోగ్య ప్రపంచంలో కాళ్ళ నొప్పులు, కీళ్ల వాపులు, నడుము నొప్పి వంటి రుగ్మతలతో ఎంతోమంది బాధ పడుతుంటారు. అంతేకాదు రైళ్ళలో ప్రయాణించే వృద్ధులకు కూడా ఈ కూలీల వ్యవస్థ చాలా ఉపయోగకరం. తమ లగేజీలు మోయలేక బాధపడే వారెందరికో ఆపద్బాంధవులు రైల్వేకూలీలు. ఇప్పుడు చాలా స్టేషన్లలో కూలీలు కనపడడంలేదు. ఒకవేళ ఉన్నా కేవలం రైల్వేవాళ్ళు రైల్వే ఉద్యోగులుగా పరిగణింపబడి, పార్శిళ్లు లోడ్‌చేయడం కోసమే వినియోగించబడుతున్నారు. ప్రయాణీకులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఈ విషయాన్ని ఒక రైల్వే అధికారి దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన నుండి విచిత్రమైన సమాధానం వచ్చింది. "ఇప్పుడు లగేజీ లన్నిటికీ చక్రాలు ఉంటున్నాయి. అంతే కాకుండా రైల్వేస్టేషన్లలో కూడా ఎస్కలేటర్లు, లిఫ్టులు వంటి అత్యాధునిక సౌకర్యాలు వచ్చేశాయి. కూలీలను ఉపయోగించుకోవడానికి ప్రయాణికులు పెద్దగా ఇష్టపడడంలేదు. అందుకోసమే రైల్వేశాఖ కూలీల వ్యవస్థను తగ్గించుకుంటూ వస్తోంది" అని సదరు అధికారి వివరణ ఇచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూలీ, పోర్టర్ అనే పదానికి బదులుగా వారిని 'సహాయక్' అని సంబోధించాలన్న జీవో కూడా తెచ్చారు. కానీ, దేశవ్యాప్తంగా 20వేలమందికి పైగా ఉన్న ఆ సహాయక్ వ్యవస్థను క్రమేణా తగ్గించుకుంటూ రావడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదని కూడా సదరు అధికారి వాపోయాడు.

ప్రయాణీకులు మాత్రం ప్రభుత్వ నిర్ణయంతో ఏకీభవించడం లేదు. స్టేషన్లలో పోర్టర్లు కనపడకపోవడం తమకు చాలా అసౌకర్యంగా ఉందని అధికమంది ప్రయాణీకులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. లగేజీలు మోయలేక ఇబ్బంది పడుతున్నాం. మేం డబ్బులిచ్చి కూలీల ద్వారా మా లగేజీలు మోయించుకుంటే ప్రభుత్వానికొచ్చే నష్టం ఏమిటి...? అంటూ ఒక మహిళా ప్రయాణికురాలు ప్రశ్నించింది. ప్రభుత్వం పునరాలోచనచేసి కూలీల వ్యవస్థ పునరుద్ధరించాలని అధిక శాతం ప్రయాణీకులు కోరుతున్నారు.

## పల్లిపాడు 'డైట్'లో

# ఇంద్రజాల ప్రదర్శన

పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో విశ్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఏ.కే. రాయలు ఇంద్రజాల ప్రదర్శన(మ్యాజిక్ షో) నిర్వహించారు. డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. రమేష్ మాట్లాడుతూ 'రిటైర్మెంట్ అనంతరం కూడా ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా తమ సమయాన్ని సద్వినియోగం చేయడం అభినందనీయమని, మ్యాజిక్ నేర్చుకొని, బోధనలో మిళితం చేసి మంచి ఫలితాలను సాధించవచ్చని' సూచించారు. విశ్రాంత డిఇఓ జి.నరసింహారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు సాదిక్‌బాషా, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, సీనియర్ డైట్ అధ్యాపకులు డా. కె.వెంకటేశ్వరరావు, డా. ఆర్.బాలాజీ రావు, పీడీ దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రవేశపరీక్ష



అల్లూరు మండలం, నార్తుమోపూరు వద్ద ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఉన్నత పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్షను అల్లూరు మరియు పరిసర ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులు హాజరైనట్లు ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి తెలియజేశారు. తమ సోదరులు సుధాకర్‌రెడ్డి పేద మరియు ప్రతిభ గల విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, మే నెల ఒకటవ వారంలో పరీక్ష ఫలితాలు తెలియజేసి అందులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సీటు కేటాయించడం జరుగుతుందని తెలియజేశారు. ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనీల్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## నగరంలో 'హెరిటేజ్ వాక్'




ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈనెల 18న పురావస్తు ప్రదర్శన శాఖ, మైనార్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నెల్లూరులో 'హెరిటేజ్ వాక్' నిర్వహించారు. స్థానిక రత్నం స్కూల్ వద్ద నుంచి మ్యూజియం దాకా నిర్వహించిన ఈ వాక్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మన వారసత్వ సంపద, మ్యూజియంలోని శిల్పాలు, నాణాలు గురించి పురావస్తు శాఖ సహాయ సంచాలకుడు జి.గంగాధర్ వివరించగా, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కనకదుర్గాభవాని జిల్లాలోని పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు.

## అంబేద్కర్‌కు.. వైకాపా నాయకుల నివాళి



భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌లో ఉన్న నాలుగు సచివాలయాల్లో వైకాపా నాయకులు అంబేద్కర్‌కు ఘన నివాళులర్పించారు. నెల్లూరు నగర ఎస్.సి.సెల్ అధ్యక్షుడు తాళ్ళూరి సురేష్‌బాబు, నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్టుబోర్డ్ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్)ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సచివాలయం కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పోతురాజు రమాదేవి, ప్రసన్నలక్ష్మి, రామ్మోహన్‌యాదవ్, సరళమ్మ, నరసింహారెడ్డి, రమేష్‌రెడ్డి, సురేష్, ఓబిలి దుర్గమ్మ, ప్రకాష్, సంతోష్, రూపేష్ పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలసిన విపిఆర్

### --- జిల్లా అభివృద్ధిపై చర్చ ---

కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను రాజ్యసభ సభ్యులు మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరులోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్‌తో ఇరువురు సమావేశ మయ్యారు. ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాల అమలుపై, జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో విపిఆర్ చర్చించారు.

## మైనార్టీలంటే ఆదాలకు అభిమానం



నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పవిత్రమైన రంజాన్ మాసంలో బారా షాహిద్ దర్గాకు 15కోట్ల రూపాయలను మంజూరు చేయించి ముస్లింల కోసం ప్రత్యేకమైన కానుకగా తెచ్చారని వైసిపి మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ సలీం కొనియాడారు. ముస్లింల పట్ల ఆదాలకు అపారమైన ప్రేమానురాగాలు ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ఎంపీ ఆదాల నివాసంలో ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం సిపిఆర్ కళ్యాణ మండపంలో ఎంపీ ఆదాల తన సొంత నిధులతో ఇఫ్తార్ విందు ఇస్తున్నారని, ముస్లింలు అందరూ తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రూరల్ మైనారిటీ వైసీపీ అధ్యక్షులు షేక్ కంతర్ అలీ, కార్పొరేటర్లు రియాజ్, సత్తార్ తదితర నేతలు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన జడ్పీ ఛైర్‌పర్సన్



కొత్తగా ఇటీవలే నెల్లూరుజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తిరుమలేశ్వరరెడ్డిని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డిలు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఈనెల 18న మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వారు ఎస్పీతో చర్చించారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతల విరాళం



నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరుకు చెందిన మునగా వరలక్ష్మి, తన భర్త జ్ఞాపకార్థం ఈనెల 17న 10 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ చెక్కును ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారా యణన్‌కు అందజేశారు. క్యాన్సర్ ఆసుపత్రిలో ఒక గదికి తన భర్తపేరును పెట్టాలని ఆమె కోరారు. అదేవిధంగా, క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధి కోసం నగరానికి చెందిన పావులూరు మాలకొండయ్య, మహాలక్ష్మిలు కలెక్టర్‌కు 5 లక్షల రూపాయల చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు, క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా నేతగా సురేష్



భారతీయ జనతాపార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వడియార సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఈనెల 16న నెల్లూరులోని బీజేపీ కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో, సురేష్‌కు జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్ కుమార్‌యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు.

## 'తంగిరాల మహాభారతం' 51వ భాగం




పాండవులు ద్రుపద రాజ భవనానికి వచ్చి ద్రుపదుడు అడిగినప్పుడు తామెవరమో నిజం చెపుతారు. ద్రుపదుడు ఎంతో సంతోషించి ఇక అర్జునునికి ద్రౌపదికి వివాహ ముహూర్తం పెట్టుకుందామని అడిగినప్పుడు, ధర్మరాజు, తామైదుగురం ద్రౌపదిని వివాహం చేసుకుంటామని చెప్పినప్పుడు ద్రుపద మహారాజు నిర్ఘాంతపోయి... అదెలా సాధ్యం, లోక విద్దూరం కదా అన్నప్పుడు... ధర్మరాజు తమ తల్లి ఆదేశాన్ని శిరసా వహిస్తామని అంటాడు. అదే సమయంలో కృష్ణద్వైపాయనుడు వచ్చి ధర్మరాజు చెప్పినదే ధర్మమని, దానిలో ఉన్న పరమ రహస్యాన్ని చెపుతానని ద్రుపద మహారాజుని ఏకాంత ప్రదేశానికి తీసుకువెళ్లి చెపుతాడు.

పూర్వం మౌద్గల్య మహామునికి పూర్వజన్మ పాపకర్మల వలన కుష్ఠువ్యాధి వస్తుంది. అతని భార్య ఇంద్రసేన భర్తను ఎంతో ఆదరంగా చూసుకుంటుంది. మౌద్గల్య మహాముని సంతోషించి ఆమెకు వరమిస్తాడు. ఆమె తనకు కామాభిలాష తగ్గలేదని, ఆయన 5 సుందర స్వరూ పాలలో మారి తనకు ఆనందం కలిగించ మని కోరినప్పుడు మౌద్గల్య మహాముని అంగీకరించి ఆమెను ఎంతో సుఖపెడ తాడు. తర్వాత తపస్సుచేసి పరబ్రహ్మలో మునిగిపోయాడు. ఇంద్రసేన తర్వాత కాశీరాజ తనయగ పుట్టి ఎన్నాళ్ళకీ పెళ్లి కాకపోతే, శివుణ్ణి భర్త కావాలని 5సార్లు అడిగినప్పుడు ఆమెకు 5గురు భర్తలని స్తాడు. ఆమె ప్రత్యేకంగా కొన్ని కోరికలు కోరినప్పుడు, ఇంద్రుణ్ణి తన వద్దకు తీసుకు రమ్మని ఆదేశిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## భగవత్ రామానుజుల అవతారోత్సవాలు



నెల్లూరులోని రంగనాయకులపేట శ్రీ రంగనాథస్వామి వారి దేవస్థానంలో సమతామూర్తి భగవత్ రామానుజుల అవతారోత్సవాలు ఈనెల 16న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామానుజుల స్వామికి తిరుమంజనం, పేట ఉత్సవంతో పాటు విశేష సేవలు, పూజలు నిర్వహిస్తున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్స వాల్లో పాల్గొంటున్నారు. ఈనెల 24వ తేది వరకు ఈ ఉత్స వాలుంటాయి. ఆలయ ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, కార్య నిర్వహణాధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

## సాయిదర్బార్‌లో వైద్యశిబిరం



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న శ్రీ సాయి దర్బార్ అద్దాలమందిరంలో ఈనెల 16న ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. సుధీర్ హాస్పిటల్స్ డాక్టర్లు జేవీ రామమోహన్, ఎం.వాణి, జేవీ వివన్ ధీరజ్, జి.నాగమాణిక్యం, పి.మొహిసిన్‌ఖాన్ పాల్గొని సుమారు 3 వందల మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులిచ్చారు. మందిరం ఛైర్మెన్ మధుసాయి, పాటోలు రామసుబ్బయ్య, పులిగండ్ల సతీష్ పర్యవేక్షించారు.

## ఉమామహేశ్వరాలయం ఛైర్మెన్‌గా బాలాజీసింగ్

నెల్లూరులోని వహాబ్‌పేటలో ఉన్న శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానానికి ఛైర్మెన్‌గా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌సి బాలాజీసింగ్ ఈనెల 16న బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులుగా ఎస్‌సి సుభాన్‌సింగ్, బి.ప్రభాకర్‌రెడ్డి, బి.నాగమణి, ఏ.శ్రీకాంత్, అర్చకులు ఆర్ శ్రీనివాసశర్మ, ఎస్‌సి గోపాల్‌సింగ్, హరీష్, శారదమ్మ నియమితులయ్యారు.



## బారాషహీద్ దర్గాకు..
# కోరిన వెంటనే నిధులిచ్చిన సీఎం
### ఎంపీ ఆదాల వెల్లడి

నెల్లూరులోని పవిత్ర దర్గా అయిన బారాషహీద్ దర్గా నిధుల కోసం సీఎం జగన్మోహన్‌రెడ్డిని రంజాన్ ప్రారంభమైన 13వ తేదీ కలిస్తే అప్పటికప్పుడే 15కోట్ల రూపాయల మంజూరుకు ఆదేశాలు జారీ చేశారని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదాల ప్రభాకరరెడ్డి చెప్పారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న రంజాన్ పండుగ ఏర్పాట్ల కోసం బారాషాహిద్ దర్గాలో అధికారులతో ఎంపీ ఆదాల సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధుల క్లియరెన్స్ రావాలంటే కనీసం 10-15 రోజులు పడుతుందని, అయితే సీఎం జగన్‌మోహన్ రెడ్డి అప్పటికప్పుడు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వైసీపీ రాష్ట్ర మైనారిటీ విభాగ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ సలీం అధ్యక్షత వహించారు.



**రాజీవ్ గాంధీ కాలనీలో పర్యటన:**

ఎంపీ ఆదాల 18 డివిజన్‌లోని రాజీవ్ గాంధీ కాలనీలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. "మా నమ్మకం నువ్వే జగన్" కార్యక్రమంలో భాగంగా ఇటీవల రాజీవ్‌గాంధీ కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లారు. స్థానికులను కలసి వారు చెప్పింది సావకాశంగా విని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు ఇంటివారిని ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను వారికి వినిపించారు. స్థానిక కార్పొరేటర్ అశోక్‌నాయుడు, వైసీపీ నేతలు వంశీ, సునీల్‌రెడ్డి, మారం సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి కుమార్‌రెడ్డి, పెనాక రామకృష్ణారెడ్డి, ఎద్దల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆదాల



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 16న జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో కలిశారు. జిల్లాకు కొత్తగా వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు ముచ్చటించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, జడ్పీటిసి మల్లు సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కోటేశ్వర్‌రెడ్డి, గునపాటి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అల్లా దయతో.. అందరూ బాగుండాలి

అల్లా దయవల్ల రంజాన్ మాసంలో అందరూ సుఖశాంతులతో బాగుండాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దేవుడిని ప్రార్థించారు. నారాయణరెడ్డిపేటలోని బిలాల్ మసీదులో ఆయన ఈనెల 16న స్థానిక ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొని సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శుభాలకు నిలయమైన రంజాన్ మాసం సత్ప్రవర్తనను, మానవతను బోధిస్తుందన్నారు. ప్రస్తుత సమాజానికి అది ఎంతో అవసరమన్నారు.

## కోవూరులో ప్రెస్‌క్లబ్‌కు..
# ఎమ్మెల్యే ప్రసన్న శంకుస్థాపన



కోవూరులోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మించబోయే ప్రెస్‌క్లబ్‌కు ఈనెల 18న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. తొలుత కోవూరు పంచాయతీలోని రామనాథపురంలో 14వ ఆర్థికసంఘం నిధులు 4లక్షల రూపాయలతో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే ప్రసన్న ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పాటూరు గ్రామంలో 'మనబడి నాడు-నేడు' 2వ దశ క్రింద నాడు-నేడు నిధులు రూ.63లక్షలతో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించబోయే అదనపు తరగతి గదుల నిర్మాణం మరియు మౌలిక వసతుల కల్పనకు ఆయన శంకుస్థాపన చేశారు.







## పారదర్శకంగా పథకాల అమలు ఘనత..
# సిఎం జగన్‌దే
### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రంలో పారదర్శకంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి మండలం మాటుమడుగు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజలను పలకరించి, వారి సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపట్ల వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిఎం జగన్ పట్ల, ఆయన అమలుచేస్తున్న పథకాల పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని రామ్ చెప్పారు.



కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు

నిర్యాణం : 23-4-1995 వర్ధంతి : 23-4-2023

# సంస్మరణ

మాకు స్ఫూర్తిప్రదాత

**శ్రీ బోగొల్లు నారాయణరెడ్డి గారి**

28వ వర్ధంతి సందర్భంగా

**వారి దివ్యస్మృతికి మా నివాళి.**

కుమారులు

**డా॥ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి**

Nellore

**బోగొల్లు మోహన్‌రెడ్డి**

Architects & Builders

Hyderabad

మరియు **కుటుంబసభ్యులు**



## పెదనాన్నకు రామ్ శుభాకాంక్షలు

తమ పెదనాన్న నేదురుమల్లి పద్మనాభరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బైసైకిల్ డిజైన్ పోటీల్లో.. ఎన్‌బికెఆర్‌కు తృతీయ స్థానం



టిఐ సైకిల్స్-చెన్నై వారు ఇటీవల నిర్వహించిన బైసైకిల్ డిజైన్ పోటీలలో కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు తృతీయ స్థానం లభించింది. సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఇండియా మరియు టి.ఐ సైకిల్స్ ఇండియా చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్.ఆర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ పోటీలో భాగంగా బైసైకిల్ డిజైన్ కాంపిటీషన్ (బి డిసి) రూల్ బుక్ నియమాలు అనుసరించి తమ విద్యార్థులు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో డిజైన్ చేసి తమ వర్క్‌షాప్‌లోనే ఈ సైకిల్‌ను తయారు చేసినట్లు తెలియజేశారు. ఎస్ఏఈ ఫ్యాకల్టీ అడ్వైజర్లు డాక్టర్ వై.అశోక్‌కుమార్‌రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు టి.ఐ సైకిల్స్-చెన్నై వారు ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పించారన్నారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

## రావిప్రోలుకు.. 'గాంధీతత్వం'పై డాక్టరేట్



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామ వాస్తవ్యుడు విఆర్ కళాశాలలో బి.ఎస్‌సి., చదివి, విశాఖపట్నంలోని కోరమాండల్ ఫర్టిలైజర్స్‌లో చీఫ్ కెమిస్ట్‌గా పనిచేసి, 2003లో ఉద్యోగ విరమణ చేసిన రావిప్రోలు సుబ్రహ్మణ్యం గాంధీజీ జీవితం మరియు గాంధీతత్వంపై డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ ఎ.బి.ఎస్.వి.రంగారావు, డాక్టర్ ఎస్.హరనాధ్‌ల సంయుక్త పర్యవేక్షణలో ఆయన "మహాత్మాగాంధీపై విద్యార్థి-యువతలో ఉన్న అవగాహన - ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నంలో ఒక అధ్యయనం" అనే తన సిద్ధాంత వ్యాసాన్ని పిహెచ్‌డి పట్టాకై విశ్వవిద్యాలయానికి సమర్పించి, ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన మిత్రుడైన ప్రఖ్యాత గాయకుడు.. దివంగత ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు తన సిద్ధాంత వ్యాస యజ్ఞాన్ని అంకితమిచ్చారు. రావిప్రోలు సుబ్రహ్మణ్యం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. ఉద్యోగ విరమణ తర్వాత కొంతకాలం పల్లిపాడులోని పినాకిని గాంధీ ఆశ్రమ కార్యనిర్వాహక సభ్యుడిగా పనిచేశారు. 79 సంవత్సరాల వృద్ధాప్యంలో కూడా ఆయనెంతో దీక్షతో తన పరిశోధనలు కొనసాగిస్తుండడం విశేషం. సుబ్రహ్మణ్యం చేస్తున్న అవిశ్రాంత కృషిని ఆయన మిత్రులు విశ్రాంత అధ్యాపకుడు దూబగుంట రామకృష్ణ, విఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం.సుబ్రహ్మణ్యం, సాహితీవేత్త డా. కాళిదాసు పురుషోత్తం, దుర్భా జనార్ధన్, నేదురుమల్లి సుబ్బారెడ్డి, ఎం.కె.ప్రసాదరావు, డా. జె.పి.వైద్య, మల్లేశ్వరరావు, జి.ఎస్. మురళీకృష్ణ, తదితరులు అభినందించారు.

## ఘనంగా యోగా దినోత్సవం



నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో ఈనెల 18న యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనేకమంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్, రామచంద్రమిషన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థినులకు యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. యోగా శిక్షకురాలు ప్రవీణ, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రమణరావు, రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి అధినేత వెంకటకృష్ణ, తెలుగు అధ్యాపకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నీళ్ళ బాటిల్ అడిగి.. బంగారు దండ లాక్కుపోయాడు

నగరంలో పట్టపగలే దుండగులు దొంగతనాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. హరనాథపురంలో దుకాణం నిర్వహిస్తున్న ఓ వృద్ధురాలిని మోటార్‌బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు నీళ్ళబాటిల్ కావాలని అడిగి, ఆ బాటిల్ ఇస్తుండగా హఠాత్తుగా ఆమె మెడలో ఉన్న మూడున్నర సవర్ల బంగారు దండను తెంపుకుపోయాడు. ఈనెల 18వ తేది మధ్యాహ్నం జరిగింది సంఘటన. వృద్ధురాలు సుధారాణి గోదుగోడుమంటూ పోలీసులను ఆశ్రయించగా, బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దుండగుడి కోసం గాలిస్తున్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్



నెల్లూరులోని కొండాయపాలెంలో ఉన్న నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం. భాస్కర్‌రావు వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను ఒక పుస్తకంగా రూపొందించి 5వ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు దానిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## విద్యార్థి దశలోనే అన్ని రంగాలపై అవగాహన

**- ఎమ్మెల్సీ మేరిగ మురళి**



చదువుతోనే అన్ని రంగాలపై అవగాహన కలుగుతుందని ఉమ్మడి నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు మేరిగ మురళీధర్ తెలియజేశారు. ఈ నెల 17వ తేదీ తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గూడూరు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం)నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 17న గూడూరు ఆర్డీవో కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఏఓ స్వర్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, పనిముట్లు అందజేయలేదన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు సంబంధించి ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులపై వేధింపులు ఆపాలన్నారు.

## మానవత్వాన్ని చాటడమే.. రంజాన్ ఆశయం



ఆధ్యాత్మికత, దాతృత్వం, మానవత్వం చాటడమే రంజాన్ నెల ఆశయమని మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్ అన్నారు. ఇటీవల గూడూరు షాదిమంజిల్‌లో ఆ సంస్థ అధ్యక్షుడు మహబూబ్ బాషా అధ్యక్షతన రంజాన్ నెల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న 150 పేద ముస్లిం కుటుంబాలను గుర్తించి... వారికి రంజాన్ కిట్, చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కాలేషా, దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, పూర్వ అధ్యక్షుడు రహీం, జామియా మసీదు అధ్యక్షులు జిలాని బాషా, ఎండీ రవూఫ్, ఎంఎఫ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మగ్దూం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రతిఒక్కరు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు అగ్నిమాపక శాఖ అధికారి చలమయ్య పేర్కొన్నారు. ఈ నెల 17న గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి చలమయ్య మాట్లాడుతూ ఎక్కువగా షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీల వలన ప్రమాదాలు జరుగుతుంటాయని తెలిపారు. ఫైర్‌సేఫ్టీ యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, చిన్నపిల్లలను గ్యాస్ సిలిండర్ల వద్దకు రానివ్వకుండా చూసుకోవాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు డి.విజయకుమార్, చంద్రశేఖర్, ప్రదీప్, హుస్సేన్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## కొండూరుకు పూలే ఎక్సలెన్స్ అవార్డు



తిరుపతి జిల్లా గూడూరు మండల పరిధి నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వర్లు మహాత్మా జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. తిరుపతిలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పూలే 196వ జయంతి వేడుకల్లో ఆయన తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి బి.చంద్రకుమార్‌ల చేతుల మీదుగా అవార్డు జ్ఞాపిక, సన్మానం అందుకున్నారు. పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 25 జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ అవార్డును అందుకున్న వెంకటేశ్వర్లును సహచర ఉపాధ్యాయులు, సాహితీ మిత్రులు అభినందించారు.



## అగ్నిప్రమాదాల పట్ల జాగ్రత్త అవసరం

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నెల్లూరులోని అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈనెల 16న వారు రంగనాయకులపేటలోని ఒక అపార్ట్‌మెంట్‌లో, అగ్నిప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మహిళలకు ప్రయోగాత్మకంగా వివరించారు. జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, నెల్లూరు అగ్నిమాపక కేంద్రం అధికారి జాషువా తదితరులు పాల్గొని, గ్యాస్ సిలిండర్ల ప్రమాదాలు జరిగినప్పుడు సిలిండర్‌కు అంటుకున్న మంటలను ఏవిధంగా ఆర్పాలి?..అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఎలా ఇవ్వాలి తదితర అనేక అంశాలపై వారికి అవగాహన కలిగించారు.

## బాధితులను ఆదుకున్న రెడ్‌క్రాస్



నెల్లూరులోని 12వ డివిజన్ టిడ్కో ఇళ్ళ దగ్గరలోఉన్న మూడు గిరిజన కుటుంబాలవారి ఇళ్ళు ఇటీవల అగ్నిప్రమాదానికి గురికావడంతో, ఆ విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ–జిల్లాశాఖ ఛైర్మెన్ ఆదేశాల మేరకు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు బాధిత కుటుంబాలను పరామర్శించి, వారిని ఆదుకున్నారు. బాధితులకు టార్పాలిన్స్, దుప్పట్లు, వంట సామాన్లు మరియు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను తమవంతు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యాలమూరి రంగారావు, రెడ్‌క్రాస్ వలంటీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈత సరదా..ప్రాణం తీసింది



ఈత సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. ముత్తుకూరు పెద్దచెరువులో తన స్నేహితుడితో కలిసి ఈతకు దిగిన చరణ్(14) కొద్దిసేపటికే మునిగిపోయాడు. ఈనెల 16న ఈ దుర్ఘటన జరిగింది. రాత్రయినా చరణ్ ఇంటికి రాకపోయేసరికి, స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన వారి తల్లితండ్రులు బంగారయ్య–దేవసేన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివకృష్ణారెడ్డి రంగంలోకి దిగి విచారించడంతో, చెరువులో ఈతకు దిగి చరణ్ గల్లంతైనట్లు తెలిసింది. చెరువు వద్దకు వెళ్ళి గాలింపు చర్యలు చేపట్టగా, మృతదేహం నీళ్లపై తేలాడుతూ కనిపించింది. కుటుంబసభ్యుల సమక్షంలో బాలుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి, కేసు నమోదు చేశారు.

## వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



నెల్లూరు కలెక్టరేట్‌లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించే తిక్కన భవన్ వద్ద ఈనెల 17న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి ఉద్యోగులతో పాటు ప్రజలకు బీపీ, తదితర వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ మండు వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగించారు. డిఎంఅండ్‌హెచ్ఓ పెంచలయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# బాధితులకు అండగా ప్రసన్న

## రూ. 2.85 లక్షల ఆర్థిక సాయం అందజేత



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇటీవల కొడవలూరు మండలంలోని పలువురు బాధితులకు ఆర్థికసాయం అందించి, ఆ కుటుంబాలకు అండగా నిలిచారు. వెంకన్నపురానికి చెందిన ఉప్పాల యామిని, యశ్వితలు తండ్రిని కోల్పోయి వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకుని వారిద్దరికి 40వేల రూపాయల సాయాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి, ఆ పత్రాలను వారికి అందజేశారు. అదేవిధంగా కొడవలూరు ఎస్సీకాలనీలో తండ్రిని కోల్పోయిన పొన్నూరు నిఖిలేష్, హరితలకు కూడా ఇరువురికి కలిపి 40వేల రూపాయలను, తల్లితండ్రులను కోల్పోయిన కొడవలూరుకు చెందిన మన్యం అక్షయకు 25వేల రూపాయలు, కొడవలూరు వలంటీర్ శిరీష ఇంటి నిర్మాణం కోసం 20వేల రూపాయలు, మల్లెల జయరాజ్ కంటి ఆపరేషన్ కోసం 20వేలు, ఎన్టీఆర్ గిరిజనకాలనీలో 5 గిరిజన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాలకు తమవంతు సాయంగా 10వేల వంతున 50వేల రూపాయలు, దివ్యాంగుడు షేక్ అబ్దుల్ రహీంకు 10వేలు, దర్గా సంఘానికి చెందిన గంగపట్నం సుధారాణికి ఇంటి నిర్మాణం కోసం 15వేల రూపాయలు, అదే ప్రాంతానికి చెందిన ఓ క్యాన్సర్ బాధితునికి 20వేలు, కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సిసి కెమెరాల ఏర్పాటుకు 40వేలు, మొత్తంగా రెండు లక్షలా 85వేల రూపాయలను ప్రసన్న తనవంతు సాయంగా బాధితులకు అందజేశారు.

### కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే ప్రసన్న

జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ హరినారాయణన్‌ను ఈనెల 17న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనతో పాటు నాయకులు వీరి చలపతి, నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ వరదొస్తే..

## సోమశిల డ్యాం కట్టడాలకు ప్రమాదం

**- బీజేపీ నాయకుడు మిడతల రమేష్**



గతంలో వరదలొచ్చినప్పుడు సోమశిల రిజర్వాయర్ ఆఫ్రాన్ నిర్మాణాలకు పనులు ప్రారంభించారని, అయితే వాటికోసం బ్లాస్టింగ్ జరిపి పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్థాంతంగా ఆ పనులు ఆగిపోయాయని, ఈ నేపథ్యంలో మరోసారి వరదలొస్తే సోమశిల డ్యాం కట్టడాలకు ప్రమాదం ఎంతైనా ఉందని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. ఈనెల 17న ఆయన నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. సోమశిల రిజర్వాయర్‌కు సంబంధించిన ఆఫ్రాన్ పనులను వెంటనే పునఃప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆమేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం సమర్పించామని చెప్పారు. అదేవిధంగా, కనిగిరి రిజర్వాయర్‌కు ఉత్తరభాగంలో రక్షణ కరకట్టగా ఉన్న రాతితిప్పలను మైనింగ్ అక్రమార్కులు దాదాపు 5 కిలోమీటర్ల మేర 40 అడుగుల గోతులు తవ్వారని, దీంతో బ్రిటిష్‌కాలం నాటి నిర్మాణమైన ఆ రిజర్వాయర్ నుంచి నీటి ఊటలు బయటకు వస్తున్నాయని, ఇది కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాద సంకేతమని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే అక్రమ మైనింగ్‌ను ఆపివేయించి, రిజర్వాయర్ కరకట్టను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చిలకా ప్రవీణ్, పోట్లూరు శ్రీనివాసులు, కంచెర్ల నారాయణ, వీరరాఘవులు, మువ్వల రాంబాబు, శివారెడ్డి, సాయి శ్రీనివాసులు, కొప్పోలు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కాలేజీల తీరుపై.. ఏఐఎస్ఎఫ్ ధర్నా

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పలు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న నెల్లూరులోని ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నాందోళన జరిగింది. సెలవుల్లో తరగతులు నిర్వహించే కళాశాలల గుర్తింపు రద్దుచేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌కిషోర్, నగర అధ్యక్షుడు వర్మ, నాయకులు స్వరూప్, మౌళి తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...



## పెంచలకోనలో.. వైభవంగా నృసింహస్వామి కల్యాణం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఇటీవల శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## కొత్తకోడూరు బీచ్ వద్ద.. వాహనాల తనిఖీలు

తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరు బీచ్ వద్ద ఈనెల 16న సిఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీచేసి, సరైన ధృవపత్రాలు లేని 80 మోటార్‌సైకిళ్ళ వారికి అపరాధరుసుం విధించారు. వాహనదారులు రోడ్డు నియమనిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులకు హితవు చెప్పారు.

## ఆమంచర్లలో.. కుష్టువ్యాధిగ్రస్తులకు చేయూత

డా. అంబేద్కర్ జయంతి సందర్భంగా, నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్లలో ఉన్న సేవాజ్యోతి కాలనీలో ఈనెల 16న కుష్టువ్యాధిగ్రస్తులకు ఎల్ఐసి ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు దుస్తులు, మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెల్లూరు డివిజన్ ఎస్‌డిఎం జివికెఆర్ రవికుమార్, నాయకులు బి.శ్రీనివాసులు, చెన్నయ్య పాల్గొన్నారు.

## అనంతసాగరంలో భూసార పరీక్షలపై అవగాహన

మండల కేంద్రమైన అనంతసాగరంలో ఈనెల 17న రైతులకు భూసార పరీక్షలు చేసే విధానంపై మండల వ్యవసాయాధికారి కె.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణాతరగతులు నిర్వహించారు. నేల సారవంతంగా ఉన్నప్పుడే మంచి పంటలు పండుతాయని, భూసార పరీక్షలు చేసిన తర్వాతే పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు.

## కావలిలో మంచినీటి బోర్లకోసం గిరిజనుల వినతి

కావలి పట్టణంలోని 36వ వార్డు చెరువుకట్ట గిరిజన కాలనీలో నీటిఎద్దడి తీర్చడం కోసం రెండు నీటి బోర్లు ఏర్పాటు చేయాలని గిరిజనకాలనీవాసులు ఈనెల 17న ఆర్డీఓ శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వారితో పాటు సిపిఎం కావలి కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, రమణయ్య, భవాని, జ్యోతి, ఎస్‌కె బాబు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'విశ్వమాత' చేయూత

నెల్లూరులోని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక నవాబుపేటలో ఉన్న మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈనెల 17న విద్యాసామగ్రిని అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి, సభ్యులు రేణుక, మహేష్, స్పందన, రాధమ్మ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## వరికుంటపాడులో శనగల కొనుగోలు కేంద్రం

మండలకేంద్రమైన వరికుంటపాడు సొసైటీ కార్యాలయంలో ఇటీవల పచ్చిశనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు శనగలు కొనుగోలు చేస్తామని సొసైటీ అధ్యక్షులు వెంకటరత్నం తెలిపారు. నాణ్యత కలిగిన శనగలను కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## చేజర్ల ఎంఇఓగా శ్రీనివాసులు

మండల కేంద్రమైన చేజర్ల విద్యాశాఖ అధికారిగా జి.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈనెల 17న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాదాల రవిబాబు, రామిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డిలు ఈ సందర్భంగా శ్రీనివాసులను శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## తెట్టులో ఉపాధి హామీ పనుల పరిశీలన

గుడ్లూరు మండలంలోని తెట్టు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఇటీవల పీడీ వెంకట్రావు పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎండ వేడిమికి కూలీలకు ఇబ్బంది లేకుండా, మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు.

# 'సేవాభూషణుడు' విపిఆర్.. పుట్టినరోజు పండుగ

## • 'వాత్సల్య'లో చిన్నారుల సంబరాలు

సేవాభూషణులు, ఆధ్యాత్మిక– సామాజిక సేవాపరాయణులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) పుట్టినరోజు పండుగ ఏప్రిల్ 19న నెల్లూరులోని వాత్సల్య అనాధ శరణాలయంలో ఆనంద






సంబరంగా జరిగింది. విపిఆర్ అభిమానులు, ఆత్మీయులు ఆయన జన్మదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. తమకు అన్ని వేళలా అండగా ఉంటూ, లక్షలాది రూపాయలతో అనాధ పిల్లలకు విద్యావసతులు కల్పించేందుకు సహకరిస్తున్న.. విపిఆర్‌కి ఎంతో ఇష్టమైన నగరంలోని 'వాత్సల్య' చిన్నారులు విపిఆర్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాత్సల్య నిర్వాహకులు కేకును కట్‌చేసి పిల్లలందరికీ తినిపించారు. వితరణగుణశీలి, సహృదయులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పదికాలాలపాటు చల్లగా వర్ధిల్లాలంటూ వేదపండితులను రప్పించి వేదాశీర్వచనం గావించారు. ఆ తర్వాత శరణాలయంలోని చిన్నారులందరికీ స్వీట్లు పంచి, భోజనం పెట్టారు. జనహిత–వాత్సల్య సంస్థ అధ్య క్షులు సామంతు గోపాలరెడ్డి, నిర్వాహక కార్యదర్శి జివి సాంబశివరావు విపిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### రక్తదానం

విపిఆర్ జన్మదిన సేవా కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరులోని 'విపిఆర్ విద్య' ప్రాంగణంలో విపిఆర్ సిబ్బంది రక్తదానం చేసి, విపిఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## మజ్జిగ చలివేంద్రాలు



విపిఆర్ పుట్టినరోజు సందర్భంగా నెల్లూరు ట్రంకురోడ్డులోని ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ పక్కన ఆడిటర్ సివి సుబ్రమణ్యం–విజయలక్ష్మి దంపతులు ఈనెల 19వతేది ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేకపూజలు చేసి, విపిఆర్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆ రోజు ఉదయం నుంచి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చందనా బ్రదర్స్ ఎదురుగా ఉన్న తమ నివాసం ఎదుట సుబ్రహ్మణ్యం దంపతులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు.

# కృష్ణచైతన్యలో ప్రాంగణ ఎంపికలు



నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 51మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల డైరెక్టర్లు డా. ఆర్.వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. మేది అసిస్టెంట్ ఇన్సురెన్స్ కంపెని, ఐసిఐసిఐ బ్యాంక్ కంపెనీలు జరిపిన ఈ ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు మేది అసిస్టెంట్ ఇన్సురెన్స్ కంపెనీలో 35 మంది, ఐసిఐసిఐ బ్యాంక్‌కు 16 మంది ఎంపికవగా, వీరికి వార్షిక వేతనం 2.5 లక్షల నుండి 3.5 లక్షల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. అలాగే ఇప్పటికే జరిగిన ప్రాంగణం ఎంపికల్లో విప్రో, ఇన్‌ఫోసిస్, టెక్‌మహేంద్ర, టిసిఎస్, క్యాప్‌జెమిని లాంటి కంపెనీల్లో ఎంతోమంది తమ విద్యార్థులు ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడినట్లు తెలిపారు. ఇప్పుడు 51 మంది విద్యార్థులు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ బి.సుధారాణి, అడ్మిన్ డీన్ సి.రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపాల్ యస్.నాగయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి.భాను చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీలో మంటలు

- **ఏసీనగర్‌లో అగ్నిప్రమాదం**
- **3 లక్షల ఆస్తినష్టం**

నెల్లూరు ఏసీనగర్‌లోని రామాలయం వీధిలో ఓ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న రామకృష్ణ అనే వ్యక్తి ఇంట్లో ఈనెల 19న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీలో మంటలు చెలరేగి సుమారు 3 లక్షల రూపాయల దాకా ఆస్తి నష్టం జరిగింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఇంట్లో దట్టమైన పొగలు వస్తుండడం చూసి స్థానికులు రామకృష్ణకు సమాచారం అందించడంతో, ఆయన పరుగుపరుగున వచ్చి చూసేసరికి ఇంట్లో మంటలు వస్తున్నాయి. అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు ఆ విషయం తెలియజేయడంతో వారు వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే ఏసీతో పాటు డబుల్‌కాట్ మంచాలు, ఫ్రిజ్ తదితరాలన్నీ మంటలకు ఆహుతయ్యాయి. ఈ ఎండా కాలం ఎప్పుడు ఎక్కడ అగ్నిప్రమాదాలు జరుగుతాయో తెలియదు, కనుక ఇళ్ళల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలంటున్నారు అగ్నిమాపకశాఖ అధికారులు.



## డా. చీమకుర్తి ధార్మికోపన్యాసం

నెల్లూరు, కరెంటు ఆఫీసు సెంటర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఇటీవల ప్రముఖ సాహితీవేత్త డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు "శ్రీనివాస కళ్యాణం"పై ధార్మికోపన్యాసం చేశారు. డా. బిరదవోలు కృష్ణమూర్తి, డా. గంగిశెట్టి శివకుమార్, పోలవరపు లక్ష్మీనరసింహారావు, రామానుజం, దేవరకొండ మురళీకృష్ణ, సూరం చంద్రశేఖరం, పాతూరు అన్నపూర్ణ, తోట సులోచన తదితరులు పాల్గొన్నారు.

## దేహదానం



నెల్లూరు నివాసి ఎర్రంరెడ్డి సుబ్బారెడ్డి (83) దేహదానం చేసి, చనిపోయినా సమాజానికి ఉపయోగపడుతూ తన జన్మను సార్థకం చేసుకున్నారు. ఈనెల 17న వృద్ధాప్యంతో ఆయన కన్నుమూశారని, వారి దేహాన్ని ఆయన కోరిక మేరకు, వారి కుటుంబ సభ్యులు పినాకిని దేహ సమర్పకుల సంస్థకు అప్పగించారని ఆ సంస్థ ఆర్గనైజర్ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్‌వి ప్రసాద్ నేత్రవైద్య సంస్థ వారు నేత్రసేకరణ చేశారని, అనంతరం ఆయన దేహాన్ని నారాయణ వైద్యకళాశాల మానవ శరీర నిర్మాణశాస్త్ర విభాగం అధిపతి కె. ఆశాలతకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇది పినాకిని దేహసమర్పకుల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 32వ దేహ సమర్పణ అని ఆయన పేర్కొన్నారు.



జిల్లా ఎస్పీ కే.తిరుమలేశ్వరరెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో కలిసి అభినందన స్వాగతం తెలుపుతున్న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి.

# ఒక హత్య... వంద ప్రశ్నలు!

(మొదటి పేజీ తరువాయి)

చిక్కినట్లయ్యింది. ఆయనకు కావలసిన సమయం ఆయనకు ఇస్తూనే, సీబీఐ దర్యాప్తుకు అవసరమైన వెసులుబాటుని వారికి కల్పించింది. నిజానికి, ఈ తీర్పుతో సీబీఐ పని చాలా తేలికైపోయిందని సీనియర్ న్యాయవాదులు అంటున్నారు.

అనుమానితుల విషయంలో ఏ దర్యాప్తు సంస్థ అయినా... అరెస్ట్ చేయడానికే చూస్తుంది. అరెస్ట్‌చేస్తే, అయిదు రోజులో, ఆరు రోజులో తమ కస్టడీకి తీసుకునే అవకాశం దర్యాప్తు సంస్థకు ఉంటుంది.

అరెస్ట్ చేయగానే, నిందితుడికి వైద్య పరీక్షలు చేయించాలి. కోర్టు సమయం ముగిసిపోతే, మేజిస్ట్రేట్ ఇంటికి నిందితుడిని భారీ భద్రత మధ్య తీసుకెళ్ళాలి. రిమాండ్ విధిస్తే, జైలుకు తీసుకెళ్ళాలి. మరుసటి రోజు కస్టడీ పిటిషన్ వేయాలి. అటూ ఇటూ వాదోపవాదాలు ఒక్కోసారి రెండు, మూడు రోజులు కూడా కొనసాగవచ్చు. ఒకవేళ కస్టడీకి నిందితుడిని అనుమతిస్తే... ముందు వైద్య పరీక్షలు చేయించాలి. కస్టడీ ముగిసిన తరువాత, మళ్లీ వైద్య పరీక్షలు చేయించి, కోర్టులో హాజరు పరిచి, జైలుకు తరలించాలి.

ఈ మొత్తం ప్రక్రియ వ్యయ, ప్రయాసలతో కూడుకుంది. అయినప్పటికీ, నిందితులను ప్రశ్నించడం ద్వారా అదనపు సమాచారం రాబట్టుకోవాలనుకున్న సందర్భాలలో 'షార్ట్ కట్' పద్ధతి లేదు. నిజానికి, ఈ 'ప్రశ్నించడం' కోసమే అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని సీబీఐ ప్రయత్నించింది. దీని నుంచి తప్పించుకోవడం కోసమే, అవినాష్ ప్రయత్నించి బొక్క బోర్లా పడ్డాడని న్యాయవాద వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

అయితే, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని 'నిశ్శబ్దం'గా, 'అనూహ్యం'గా సీబీఐ అరెస్ట్ చేయడంతో, సీబీఐ దర్యాప్తు ప్రక్రియ ఒక కీలక మలుపు తిరిగింది. దానికితోడు, ఎం.పి అవినాష్‌రెడ్డి తనంతట తానుగా హైకోర్టుకు వెళ్లి, సీబీఐ 'వల'లోకి వచ్చేశారు. ఆయనను అరెస్ట్‌చేసి, వైద్య పరీక్షలు చేయించి, కస్టడీకి తీసుకుని, మళ్లీ వైద్య పరీక్షలు చేయించి, జైలుకు తరలించే భారం సీబీఐకి తప్పిపోయింది.

రేపు 25వ తేదీవరకు ఆయన, ప్రతిరోజూ సీబీఐ విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆయనను ఆదేశించింది. అవినాష్ వర్గానికి ఇది ఊహించని పరిణామం అని న్యాయవాద వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇప్పటికే వై.ఎస్.భాస్కర్‌రెడ్డి సీబీఐ కస్టడీలో ఉండడం, ఆయన కుమారుడు వై.ఎస్.అవినాష్‌రెడ్డి కూడా సీబీఐకి అందుబాటులోకి రావడంతో సీబీఐ దర్యాప్తుకి మార్గం సుగమం అయ్యిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అవినాష్‌రెడ్డికి ఈ నెల25 వరకే హైకోర్టు అరెస్టు నుండి మినహాయింపు ఇచ్చింది. ఆ గడువు గనుక పొడిగింపుకు నోచుకోకపోతే, ఆయనని కూడా సీబీఐ అరెస్ట్‌చేసే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

ఈ 'సుదీర్ఘ' విచారణ అనంతరం, ఇప్పుడు నిందితులుగా సీబీఐ భావిస్తున్న వారిపై అభియోగాలు రుజువు కావచ్చు, కాకపోవచ్చు.

అయితే, తన అభియోగాలను రుజువు చేయడం సీబీఐకి ఎంత ప్రతిష్టాత్మకమో, ఆ అభియోగాలనుంచి బయటపడడం నిందితులకూ అంతే ప్రతిష్టాత్మకం అనడంలో సందేహం లేదు.

### కథ నడిపిస్తుందెవరు...?

కథ మొత్తం అవినాష్ కుటుంబం చుట్టూ తిరుగుతుండడంతో, అసలు దీని వెనుక ఎవరున్నారన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. రాష్ట్రంలో అధికారం జగన్‌మోహన్‌రెడ్డిదే. కేంద్రంలో ఉన్న కమలదళంతో ఆయనకి సన్నిహిత సంబంధాలే ఉన్నాయి. మరి, పదే....పదే కుట్ర జరుగుతోందని ఘోషిస్తున్న ముఖ్య సలహాదారులు, మంత్రులు వారి మనసులో ఎవరున్నారో బయటపెట్టడంలేదు. ఒకవేళ సిబిఐని చంద్రబాబు ప్రభావితం చేస్తున్నారా..? అంటే ఆలా చెప్తే అది అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికీ ఇద్దరికీ అవమానమే. మరి కుట్ర చేస్తున్న మూడవ శక్తి ఎవరన్నది కూడా ఇప్పుడు సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోతుంది.

హత్య కేసులో నిందితుడిగా ఉన్న దస్తగిరి తనకు ప్రాణహాని ఉందంటున్నాడు. అనీ అనగానే, అతనికి ఆరుగురు పోలీసులతో భద్రత కల్పించారు. దీనిని బట్టి, ఈ కేసుకు ఎంతటి ప్రాముఖ్యత ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఒక్కరోజు సిబిఐ విచారణకు వెళ్లిన భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సిబిఐ కస్టడీకి కోర్టు అనుమతించిన తరువాత, అది ముగియక ముందే నిందితులకు బెయిల్ ఇచ్చిన సందర్భం గతంలో ఎప్పుడూ లేదు. మరోవైపు వివేకా కుమార్తె సునీత కూడా సుప్రీంకోర్టులో గురువారం నాడు పిటిషన్ దాఖలు చేసింది. అవినాష్‌ను 25 వరకు అరెస్ట్ చేయొద్దని హైకోర్టు చెప్పడాన్ని ఆమె తప్పు పడుతున్నారు.

ఎటు చూసినా ఈ కథంతా వై.ఎస్. కుటుంబం చుట్టూ తిరుగుతోంది. కేంద్రంలో, రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, అనేక అనుమానాలు, అపోహలతో వివేకానందరెడ్డి కేసు 'ఒక హత్య... వంద ప్రశ్నలు' అన్నట్లుగా తయారయ్యింది. 'హూ కిల్డ్ వివేకా..?' అన్న సస్పెన్సు మాత్రం కొనసాగుతూనే ఉంది.

# చిరస్మరణీయులు.. డా.బిఆర్ అంబేద్కర్



సృష్టిలో సూర్యచంద్రులున్నంత వరకు దేశ ప్రజల మనసుల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిలిచి ఉంటారని, ఆయన చిరస్మరణీయులని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా పొదలకూరులో అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ఇప్పటికీ సామాజిక న్యాయం పరిఢవిల్లుతుందంటే మహనీయుడు, దార్శనికుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చూపిన చొరవే కారణమన్నారు. వారి ఆశయ సాధనకు అందరం కలసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

# పండ్లు పుష్పాలతో.. ప్రసన్నాంజనేయునికి పూజలు

నెల్లూరు పప్పులవీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ఆలయ అర్చకులు ఈనెల 18 సిందూరాన్ని అలంకరించి, మామిడిపండ్లు, వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. ఉభయకర్తలుగా శ్రీరామ్ సురేష్–పుష్పలత దంపతులు వ్యవహరించారు. ఆలయ నిర్వాహకులు సుబ్బారావు, రామచంద్రరావు, బాలాజీ, సాయిబాబా, ఇఓ హేమచంద్రరావు తదితరులు పర్యవేక్షించారు.

## అయ్యప్పస్వామికి
# విశేష పూజలు

నెల్లూరు నగరం వేదాయపాలెంలో కొలువై ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దేవ స్థానంలో ఇటీవల అయ్యప్పస్వామి వారికి విషుకన్ని దర్శనం ఘనంగా నిర్వహించారు. శనివారం నాడు కేరళ శబరి మలైలో జరిగే విధంగా నెల్లూరులోనూ అయ్యప్ప స్వామివారికి ఈ వేడుక చేపట్టారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయలు, ధాన్యాలతో దేవస్థానాన్ని అలంకరించారు. స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కే.సూర్యనారాయణరెడ్డి, కత్తి మోహన్‌రావు, బి.నరేంద్రరెడ్డి, జీవి కృష్ణారెడ్డి, వి.సునీల్‌రెడ్డి, నాగేశ్వరరావు, మంగమూరు కృష్ణచైతన్యరెడ్డి, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

# శిశుగృహ, బాలసదనాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



నెల్లూరు నగరంలోని ఐసిడిఎస్ కార్యాలయం సమీపంలో ఉన్న అనాథ బాలల సంరక్షణ కేంద్రం శిశు గృహ, బాలల సదనాన్ని ఈనెల 18న జిల్లా కలెక్టర్ హరినారాయణన్ సందర్శించారు. శిశు గృహలోని చిన్నారుల యోగక్షేమాలను సంరక్షకులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వంటశాలను తనిఖీ చేశారు. చిన్నారులకు సకాలంలో పాలు, ఆహార పదార్థాలు అందించాలని, నిర్దేశించిన సమయంలోపు అన్ని వ్యాక్సిన్‌లను వేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే బాలల సదనాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ వంటశాల, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చిన్నారులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా మెరుగైన సేవలు అందించాలని, ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఐసిడిఎస్ పీడీ సౌజన్య, ఏసిడిపిఓ అనురాధ, డిసిపిఓ సురేష్, బాలల సంరక్షణ అధికారి సమత, మేనేజర్ లక్ష్మి, సూపరింటెండెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# ఇంతకీ వివేకా కిల్లర్స్ ఎవరు?



డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి సోదరుడు వై.ఎస్.వివేకానందరెడ్డి మర్డరైపోయి నాలుగేళ్లు పూర్తి అయ్యాయి. ఇప్పుడు, ఆయన కిల్లర్స్ ఎవరు అని అడిగితే, రామాయణం అంతా విని, రాముడికి సీత ఏమవుతుందని అడిగినట్టు ఉంటుంది. అయినా అడగక తప్పేట్టు లేదు.

2019 ఫిబ్రవరి 14 రాత్రి ఆయన మర్డర్ అయ్యారు. మరుసటి రోజు ఉదయమే, 'వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు' అనే దుర్వార్తతో ఆంధ్ర దేశానికి తెల్లవారింది. తరువాత, గుండెపోటు కాదని తేలింది.

'నారా'సురులే వివేకాను హత్య చేశారని మరుసటి రోజు సాక్షి పత్రిక, టీవీ కూడా... ప్రకటించాయి. ఆ విధంగా 'నారాసురులు' మొదటి జనరేషన్ కిల్లర్స్‌గా పరిచయమయ్యారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి, సీబీఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టుకు వెళ్లిన నాటి నుంచి ఇప్పటి వరకూ వివేకా 'కిల్లర్స్' మారుతూ వచ్చారు. ఇప్పటికీ ఈ విషయమై స్పష్టత లేదు.

నాలుగు సంవత్సరాలుగా సా... గు... తూ... వస్తున్న వై.ఎస్.వివేకా మర్డర్ ఘటనలో సీబీఐ దర్యాప్తు ఒక కొలిక్కి దాదాపుగా వస్తున్నట్టు కనపడుతోంది.

హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసును విచారించి, తీర్పు ఇవ్వాల్సి ఉంది. అది ఇప్పట్లో ఉండకపోవచ్చు. ఎప్పటికి ఉంటుందో కూడా తెలియక పోవచ్చు. ఈ కేసు విచారణ, తీర్పు అనేవి చాలా సంవత్సరాల దూరంలో ఉండడానికి అవకాశం ఉందనే భావన చాలామందిలో ఉంది. అసలు ఇక్కడిదాకా రావడమే ఇప్పటికి చాలా గొప్ప అనే వారు కూడా లేకపోలేదు. సరే, ఇంతకీ కిల్లర్స్ ఎవరు?

వివేకా ఏకైక కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి ఈ విషయంలో అనితర సాధ్యం అనతగ్గ పోరాటం చేస్తున్నారు, కిల్లర్స్ ఎవరో కనిపెట్టడానికి.

నిజానికి, ప్రతి తెలుగింటికీ తెలిసిన కుటుంబం వై.ఎస్.ది. ఆ కుటుంబంలో ఏది జరిగినా క్షణాలలో తెలుగువారికి తెలిసిపోతుంది. రాజకీయంగా వై.ఎస్.ది తెలుగు సమాజంలో ఫస్ట్ ఫ్యామిలీ. తెలుగు సమాజంలో ఏ రాజకీయ కుటుంబమైనా... వై.ఎస్. కుటుంబం తరువాతే.

వై.ఎస్. ఇంటిపేరుతో పులివెందులలోనూ, బయటా వందలు, వేలమంది ఉన్నప్పటికీ.. ఆ రెండు అక్షరాలతో ఐడెంటిఫై అయ్యేది మాత్రం డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి, ఆయన కుటుంబం, ఆయన ముగ్గురు తమ్ముళ్ళలోని వివేకానందరెడ్డే అని అంటారు. ఈ కుటుంబంలో చీమ చిటుక్కుమంటే... క్షణాలలో జనంలోకి పాకిపోతుంది.

అందుకే, వివేకా ఏమిటి... మర్డరైపోవడం ఏమిటి అంటూ తెలుగువారు నిశ్చేష్టులై పోయారు. నివ్వెరపోయారు.

2019 ఎన్నికలకు ముందు ఈ మర్డర్ జరగడంతో, సహజంగానే ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది.

తిరుమల ఘాట్ రోడ్డు ఎన్ని మలుపులు తిరిగి ఉంటుందో... ఈ కేసు దర్యాప్తు అన్ని మలుపులు తిరుగుతూ, ఇప్పుడో ముగింపుకు వచ్చిందా అనే భావం కలగడానికి ఆస్కారం కలుగుతోంది. అయినప్పటికీ, కిల్లర్స్ ఎవరన్నది స్పష్టత రావడం లేదు.

తన తండ్రి మర్డర్‌కు ఫలానా వారు కారకులు అంటూ ఓ అనుమానితుల జాబితాను డాక్టర్ సునీతారెడ్డి, ఏపీ హైకోర్టులో సమర్పించారు. వారంతా ఇప్పుడు సీబీఐ రాడార్ పరిధిలోకి వచ్చేశారు.

వై.ఎస్.భాస్కర్‌రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసేసింది. ఆయన కుమారుడైన కడప ఎం.పీ అవినాష్‌రెడ్డి అరెస్ట్‌కు సీబీఐ డైరెక్టర్ ఇంకా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు లేరు. దాంతో, ఆయన తండ్రి భాస్కరరెడ్డిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. అవినాష్‌రెడ్డిని ఈ నెల 25 వరకు అరెస్ట్ చేయకుండా తెలంగాణ హైకోర్టు ఉపశమనం కలిగించింది. అప్పటికి, సీబీఐ అధికారులకు, 'పై నుంచి' ఆదేశాలు వస్తాయా అనేది చూడాల్సి ఉంది. లేకపోతే, సీఆర్పీసీ 160 సెక్షన్‌తోనే మరికొన్నాళ్ళు సీబీఐ అధికారులు కాలక్షేపం చెయ్యాల్సి రావచ్చు. హైకోర్టు ఆయనకు 'ఉపశమనం' కలిగించిందని చెప్పడానికి లేదు. ఎందుకంటే ఆయన నిన్న బుధవారం నుంచి 24 తేదీ సోమవారం వరకు రోజూ సీబీఐ విచారణకు






హాజరు కావాలని హైకోర్టు చెప్పింది. సీబీఐ విచారణకి సహకరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

నిజానికి, ఈ ఆరురోజులే సీబీఐ దర్యాప్తుకు కూడా కీలకం. ఆయన తండ్రి భాస్కరరెడ్డి, వారి ముఖ్యఅనుచరుడుగా సీబీఐ చెబుతున్న ఉదయ కుమార్‌రెడ్డి కూడా సీబీఐ కస్టడీలోకి వచ్చారు.

అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేసినా, చేయకపోయినా సీబీఐకి కావలసింది కూడా ఈ ముగ్గురునీ విడివిడిగాను, ఎదురుబొదురుగా కూర్చోపెట్టి విచారించడమే. ఆ లక్ష్యం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో నెరవేరుతుంది. ఈ మర్డర్ దర్యాప్తుకు సంబంధించి ఇది ఒక పార్శ్వం. చట్టం... దర్యాప్తు, నేరస్థులు, కోర్టులు, విచారణకు సంబంధించింది. ఈ పార్శ్వంలో చివరి మాట వినడానికి ఏళ్ళు... పూళ్లు పట్టవచ్చు. ముద్దాయిలుగా సీబీఐ పేర్కొన్న వారిలో కొందరు ఈలోగా వృద్ధాప్యం... లేదా... అనారోగ్యం వల్ల కాలం కూడా చేయవచ్చు. అప్పటికి, జనంలో ఆసక్తి కూడా ఆవిరైపోవచ్చు. అందుకే, చట్టపరంగా వివేకా కిల్లర్స్‌ఎవరో తెలియడం ఇప్పట్లో జరిగే పని కాదు.

ఈ కేసు దర్యాప్తు అధికారిగా నియమితులైన సీబీఐ డీఐజీ చౌరాసియా – ఐజీ అయ్యి, అడిషనల్ డీజీ అయ్యి, డీజీ అయ్యి, రిటైర్ అయ్యేదాకా సీబీఐ కోర్టులో తేలక పోవచ్చు.

ఈ పార్శ్వానికి తోడు, మరో పార్శ్వం ఉంది. అదే ప్రజా కోర్టు.

2019 ఎన్నికలకు మూడు నెలల ముందు ఈ మర్డర్ జరగడంతో, అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి.. ఈ అంశాన్ని ప్రజాకోర్టుకు బలంగా, ఎఫెక్టివ్‌గా తీసుకువెళ్లారు. ప్రజలు తీవ్రంగా స్పందించారు. 'నారా వారి రక్తచరిత్ర' అని వైసీపీ వారు చెబితే, జనం నమ్మారు. ఎన్నికల్లో వైసీపీ ఘన విజయానికి దారి తీసిన కారణాలలో ఈ మర్డర్ కూడా ఒకటి అని పరిశీలకులు ఆ రోజుల్లో విశ్లేషంచారు.

ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి. ఈసారి ఈ అంశం కూడా ప్రజాకోర్టుకు ప్రముఖంగా రాబోతోంది. అయితే, అప్పుడు వైసీపీ అయితే ఈసారి టీడీపీ ఈ అంశాన్ని ఎన్నికల అంశంగా మార్చబోతోంది. ఆ విషయాన్ని చంద్రబాబునాయుడు ఇప్పటికే ప్రకటించారు. ఊరూర, వాడవాడలా ఈ అంశాన్ని టీడీపీ ప్రస్తావిస్తుంది. అదేస్థాయిలో కౌంటర్ ప్రచారం చేపట్టక తప్పని పరిస్థితి వైసీపీకి ఎదురుకావచ్చు.

ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పుకోవచ్చు.

అవినాష్‌రెడ్డికి ఇప్పుడు తెలంగాణ హైకోర్టులో లభించిన ఊరట తాత్కాలికమే అని అంటున్నారు. ఆయన తండ్రి వై.ఎస్.భాస్కరరెడ్డి, వారి ముఖ్య అనుచరుడిగా సీబీఐ పేర్కొనే ఉదయకుమార్‌రెడ్డిని ఆరు రోజుల సీబీఐ కస్టడీకి సీబీఐ కోర్టు అనుమతించినందున, కొత్తగా అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేసినా... చేయకపోయినా సీబీఐ దర్యాప్తులో పెద్దగా తేడా ఉండకపోవచ్చు. అవినాష్‌రెడ్డికి 'ఊరట' ఇచ్చింది హైకోర్టు అయితే, ఆయన తండ్రిని సీబీఐ ఆరు రోజుల కష్టడీకి ఇచ్చింది నాంపల్లి లోని సీబీఐ కోర్టు.

అయితే, భాస్కరరెడ్డిని ప్రశ్నించే క్రమంలో సీబీఐ మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక వైద్యుడిని ఈ ఆరు రోజులు... సీబీఐ ఆఫీసులోనే ఉంచాలి, ఆయనకు ఉన్న అనేక ఆరోగ్య సమస్యల దృష్ట్యా.

ఈ నెలాఖరుకు ఈ కేసు దర్యాప్తు స్టేటస్‌పై సీబీఐ సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది అంటున్నారు. ఈ నేపథ్యంలో అవినాష్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై రేపు 25వతేదీ బుధవారం నాడు హైకోర్టు తీర్పు వెలువడే అవకాశం ఉంది. అప్పటికి, వై.ఎస్.భాస్కరరెడ్డి 'ఇంటరాగేషన్' కూడా పూర్తి అవుతుంది. ఇక, అవినాష్‌రెడ్డి సీబీఐకి కొత్తగా చెప్పే విషయాలు ఏమీ ఉండకపోవచ్చు. చెప్పవలసిన విషయాలు ఇప్పటికే మీడియాకు, న్యాయవాది ద్వారా హైకోర్టుకు చెప్పేశారు. ఒక కొత్త కిల్లర్ బ్యాచ్‌ని తెరమీదకు తీసుకువచ్చారు.

విషయం ఛార్జిషీట్ దశ వరకు వస్తే, ఆ విషయం సీబీఐ చూసుకుంటుంది.

కానీ టీడీపీ, వైసీపీ చూసుకోవలసింది మాత్రం ప్రజాకోర్టే.

వివేకానందరెడ్డి ఏకైక కుమార్తె సునీతారెడ్డి వాదనను, అవినాష్‌రెడ్డి వాదనను ప్రజలు ఎంతవరకు నమ్ముతారు అనే అంశంపైనే ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. అంటే... వై.ఎస్.వివేకానందరెడ్డి మర్డరే ప్రధాన ఎలక్షన్ ఇష్యూ కాబోతోంది.

అన్నట్టు, ఇంతకీ వివేకానందరెడ్డి కిల్లర్స్ ఎవరు?

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com



# బీసీల అభ్యున్నతి.. టిడిపితోనే

**● రౌండ్‌టేబుల్ సమావేశంలో 'దేశం' నాయకులు**

బీసీల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమవుతుందని నెల్లూరులో ఈనెల19న జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తెలుగుదేశం నాయకులు స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వంలో బీసీల అభివృద్ధికి కార్పొరేషన్‌లు పెట్టామని చెప్తున్నారే కానీ, ఒక్కరూపాయి కూడా వాటికి కేటాయించలేదని విమర్శించారు. నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన ఈ సమావేశానికి మాజీమంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షత వహించారు. వైకాపా మినహా అన్ని పార్టీల బీసీల నాయ కులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీసీలకు తొలినుంచి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటోందని చెప్పారు. బీసీలకు సమా జంలో మంచి గుర్తింపు వచ్చేలా టిడిపి మేనిఫెస్టోను అమలుచేస్తామన్నారు. వైకాపా తప్పులను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని, అలాంటి దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగే సమయం వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ విజయానికి నడుం బిగించాలని ఆయన కోరారు. వైకాపా పాలనలో బీసీలపై దాడులు పెరిగాయని మాజీమంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ, నెల్లూరులో నాలుగేళ్ళుగా బీసీభవన్‌ను నిర్మించుకోలేకపోవడం విచారకరమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీభవన్‌కు నగరంలో స్థలం సాధించిపెట్టామని, అప్పట్లో మంత్రిగా ఉన్న అచ్చన్నాయుడు ద్వారా దాని నిర్మాణానికి నిధులు కూడా కేటాయించామని, వైకాపా అధికారంలోకి వచ్చాక ఆనాటి శిలాఫలకాన్ని కూడా పగలగొట్టారని, ఇప్పటికీ నెల్లూరులో బీసీభవన్ నిర్మాణం కాకపోవడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. బీసీలకు సంబంధించి సమగ్ర కులగణన జరగాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఏర్పాటుచేయాలని తదితర కోర్కెలతో తీర్మానాలు చేశారు. మరో మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, టిడిపి నాయకుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ బీసీలు తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ఏపిఐఐసి మాజీ ఛైర్మెన్ కృష్ణయ్య, బిజెపి నాయకుడు ఎం.సురేష్, జనసేన నాయకుడు వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకుడు సిరాజ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, గౌడసంఘం నాయకులు జనార్ధన్‌గౌడ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్, వడ్డెరసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేమాల గోపి, మత్స్యకార సంఘం నాయకుడు శ్రీరాములుతో పాటు నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన అనేకమంది బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లను దిష్టిబొమ్మలుగా మార్చారు

**కేంద్రం ఇస్తున్న నిధులను..పక్కదారి పట్టిస్తున్న వైకాపా ప్రభుత్వం**

**'సర్పంచ్‌ల చైతన్యసదస్సు'లో నాయకుల ఆందోళన**



వైకాపా ప్రభుత్వం సర్పంచ్‌లను దిష్టిబొమ్మలుగా చేసిందని, కేంద్రప్రభుత్వం ఇస్తున్న కోట్లాదిరూపాయల నిధులను రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, సర్పంచ్‌ల వ్యవస్థ మనుగడ సాగించడానికి, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు సర్పంచ్‌లంతా పార్టీలకు అతీతంగా ఏకమై, తమ కోర్కెల సాధనకు ఉద్యమించాలని పంచాయతిరాజ ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. సర్పంచ్‌లకు పోటీగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి, సర్పంచ్‌లకు విధులు, నిధులు లేకుండా చేసి, సర్పంచ్‌లను కేవలం ఉత్సవవిగ్రహాలుగా మార్చేసిందని ఆయన దుయ్యబట్టారు. ఈనెల 19న నెల్లూరుజిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులో భారీఎత్తున చైతన్యసదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, 2022-23లో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీల కోసం 2020 కోట్లు కేటాయించిదని, ఆ నిధులేమయ్యాయి? పక్కదారి పట్టాయా? అని ఆయన ప్రశ్నించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో సర్పంచ్‌ల వ్యవస్థ అంతా అస్తవ్యస్థంగా మారిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లను ముఖ్యమంత్రి తన మొండి వైఖరితో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను వెంటనే రద్దుచేసి చట్టాలను గౌరవించాలన్నారు. మూడున్నరేళ్ళుగా ప్రభుత్వం నిలిపేసిన పంచాయతీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కేంద్రప్రభుత్వం మంజూరుచేసిన 14, 15 ఆర్థికసంఘాల నిధులను వెంటనే రాష్ట్రప్రభుత్వం సర్పంచ్‌ల పిఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లో జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ శివకుమార్ అధ్యక్షత వహించారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, రాష్ట్ర కన్వీనర్ నాగేంద్రప్రసాద్‌రెడ్డి, డికె శ్రీనివాసన్, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిడిపి, బిజెపిలకు సంబంధించిన పలువురు సర్పంచ్‌లతో పాటు వైకాపా మద్దతుతో గెలుపొందిన పలువురు సర్పంచ్‌లు కూడా ఈ సదస్సుకు హాజరు కావడం విశేషం.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com